సోమవారం రాత్రి ఎయిర్‌పోర్టులో చంద్రబాబు నాయుడుకు జ్ఞాపిక అందజేస్తున్న పార్టీ నాయకులు



24 గంటలు గడవకముందే...

- విడిపోయిన ఫ్లోటింగ్ బ్రిడ్జి
- ఆర్‌కే బీచ్ ప్రమాదకరం... లోతు ఎక్కువ...పైగా రాళ్లు!!
- తెలిసీ అక్కడే ఫ్లోటింగ్ బ్రిడ్జి నిర్మాణం

విశాఖపట్నం ఆర్‌కే బీచ్‌లో ఏర్పాటుచేసిన 'అలలపై వంతెన (ఫ్లోటింగ్ బ్రిడ్జి)' ప్రారంభించిన 24 గంటలకే రెండు ముక్కలైంది. పర్యాటకులకు అందుబాటులోకి రాకముందే ఎందుకు కొరగానిదని తేలిపోయింది.

- మెయిన్‌లో





విమానాశ్రయంలో సోమవారం రాత్రి చంద్రబాబునాయుడుకు వీడ్కోలు పలుకుతున్న పీలా గోవింద, పీలా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, కోరాడ రాజబాబు, గుమ్మడి సంధ్యారాణి, రామ్మోహన్‌నాయుడు, శ్రీభరత్, కనకమేడల రవీంద్రబాబు

వైసీపీ నేతల గుప్పిట్లో ఫిల్మ్‌నగర్ క్లబ్!

వారనుకున్నట్టుగానే కార్యవర్గం ఎన్నిక

- 19 నుంచి నామినేషన్లకు శ్రీకారం
- 25వ తేదీతో ముగిసిన గడువు
- అధికార పార్టీకి చెందిన వారు కావడంతో ప్రస్తుత కార్యవర్గంపై పోటీ చేసేందుకు ఎవరూ ముందుకురాని వైనం
- దాంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటన
- చైర్మన్‌గా కాయల వెంకటరెడ్డి
- కోశాధికారిగా ఎస్ఆర్ గోపీనాథరెడ్డి
- సినిమాలతో సంబంధం లేని వారికి కమిటీలో స్థానం కల్పించడంపై విమర్శల వెల్లువ

విశాఖపట్నం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): వైజాగ్ ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్ ఎన్నికను వారు అనుకున్నట్టుగానే నిర్వహించారు. మార్చి 5వ తేదీన పోలింగ్ నిర్వహిస్తామంటూ...ఈ నెల 19న నామినేషన్ల ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. పరిశీలన, ఉపసంహరణల గడువు ఫిబ్రవరి 25వ తేదీతో ముగిసిపోయింది. అధికార పార్టీకి చెందిన నాయకులపై పోటీకి ఎవరూ ముందుకురాలేదు. దీంతో చైర్మన్‌గా కాయల వెంకటరెడ్డి, సెక్రటరీగా సీహెచ్ శ్రీనివాసరాజు, సంయుక్త కార్యదర్శిగా ఎంఎస్ఎన్ రాజు, ఉపాధ్యక్షునిగా ఆర్‌వీ చంద్రమౌళి, కోశాధికారిగా ఎస్ఆర్ గోపీనాథ్‌రెడ్డి ఎన్నికైనట్టు ప్రకటించారు. మేనేజింగ్ కమిటీలో ప్రధాన కార్యవర్గం అంతా ఏకగ్రీవం కావడంతో పోలింగ్ తేదీ వరకూ వేచి ఉండకుండానే వారు గెలిచినట్టు ప్రకటించారు. సభ్యులను కూడా ఏకగ్రీవంగానే ఎన్నుకున్నట్టు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.



అధ్యక్షుడిగా ఎంపికైన కాయల వెంకటరెడ్డికి సహచరుల సత్కారం

ఫిల్మ్‌నగర్ క్లబ్



సినిమాలతో సంబంధం లేని వారికే పగ్గాలు

ఈ క్లబ్‌ను సినిమా అభివృద్ధి కోసం ఉపయోగించుకోవాలని సంబంధిత రంగాలకు చెందిన వారికి సభ్యత్వం కల్పించి ప్రారంభించారు. సాంస్కృతిక సంస్థలకు చెందిన వారికి కూడా సభ్యత్వం ఇవ్వాలని నిర్ణయించారు. సినిమా రంగంతో అనుబంధం లేని వారికి సభ్యత్వం ఇచ్చినా వారికి మేనేజ్‌మెంట్ కమిటీతో స్థానం ఉండకూడదు. ఏ క్లబ్ అయినా అంతే. కానీ ఇక్కడ మూడేళ్ల క్రితం వైసీపీ నాయకులు అడ్డగోలుగా క్లబ్‌ను హస్తగతం చేసుకున్నారు. క్లబ్‌కు అవసరమైన భూమిని ప్రభుత్వం నుంచి ఇప్పిస్తామనే భరోసాతో అడుగుపెట్టారు. అధికారంలో ఉన్నది వారే అయినప్పటికీ గజం స్థలం కూడా ఇప్పించలేకపోయారు. సభ్యత్వ రుసుముల ద్వారా కోట్లాది రూపాయలు వసూలైంది. దానిపై కొందరు కన్నేశారు. భీమిలి సమీపాన ఏడు ఎకరాల భూమిని రూ.25 కోట్లకు కొనుగోలు చేయాలని ఇటీవల నిర్ణయించారు. దీనిని చాలామంది వ్యతిరేకించారు. ప్రభుత్వం నుంచి రాయితీ ... మిగతా 6వ పేజీలో

చంద్రబాబు తిరుగు ప్రయాణం

- శ్రీకాకుళంలో 'రా...కదలిరా' సభ ముగించుకుని హైదరాబాద్ బయలుదేరిన టీడీపీ అధినేత
- ఎయిర్‌పోర్టులో వీడ్కోలు పలికిన ఉమ్మడి విశాఖపట్నం జిల్లా నాయకులు

గోపాలపట్నం, ఫిబ్రవరి 26: శ్రీకాకుళం జిల్లా పర్యటన ముగించుకుని హైదరాబాద్ ప్రయాణమైన తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు సోమవారం రాత్రి విమానాశ్రయంలో పార్టీ నాయకులు ఘనంగా వీడ్కోలు పలికారు. చంద్రబాబు నాయుడు శ్రీకాకుళంలో 'రా...కదలిరా' సభను ముగించుకుని రోడ్డు మార్గంలో రాత్రి 8.30 గంటలకు విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయన వెంట శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఉన్నారు. ఎయిర్‌పోర్టులో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం.శ్రీభరత్, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షుడు బుద్ధా నాగజగదీశ్వరరావు, తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత, మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, గుమ్మడి సంధ్యారాణి, కోళ్ల లలితకుమారి, కోరాడ రాజబాబు, హర్షవర్ధన్‌ప్రసాద్, పీలా శ్రీనివాస్ చంద్రబాబునాయుడుకు వీడ్కోలు పలికారు. అనంతరం ఆయన ప్రత్యేక విమానంలో హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు.

సీబీఆర్ఎన్ మెడికల్ మేనేజ్‌మెంట్ సెంటర్ ఏర్పాటు ఎన్నడో?

పారిశ్రామిక ప్రమాద బాధితులకు మెరుగైన వైద్యం అందించే దిశగా కేంద్రం యోచన

- దేశంలోని పది చోట్ల కెమికల్, బయోలాజికల్, రేడియోలాజికల్ అండ్ న్యూక్లియర్ మెడికల్ మేనేజ్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు నిర్ణయం
- రాష్ట్రంలో విమ్స్‌లో ఏర్పాటుకు ప్రతిపాదన
- రెండు ఎకరాలు కేటాయింపు
- తమిళనాడులో వైద్యులకు శిక్షణ కూడా పూర్తి
- ఏడాది దాటినా ముందుకుసాగని ప్రక్రియ




విశాఖపట్నం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో సెకండరీ లెవెల్ కెమికల్, బయోలాజికల్, రేడియోలాజికల్ అండ్ న్యూక్లియర్ (సీబీఆర్ఎన్) మెడికల్ మేనేజ్‌మెంట్ సెంటర్ పనులు ముందుకుసాగడం లేదు. పరిశ్రమల్లో ప్రమాదాలు, విపత్తులు వంటివి సంభవించినప్పుడు క్షతగాత్రులకు అత్యుత్తమ వైద్యం అందించాలనే ధ్యేయంతో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా సీబీఆర్ఎన్ సెంటర్లను ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. రాష్ట్రానికి కేటాయించిన సెంటర్‌ను విమ్స్‌లో ఏర్పాటుచేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇందుకు రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించింది. ఈ సెంటర్‌లో పనిచేయనున్న వైద్యులకు కేంద్రం శిక్షణ కూడా ఇచ్చింది. కానీ, ఆ తరువాత కేంద్రం నుంచి కదలిక లేదు.

అత్యాధునిక వైద్యానికి అవకాశం

ఈ సెంటర్ ఏర్పాటైతే ప్రమాద బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవకాశం ఉంటుంది. పరిశ్రమల్లో ప్రమాదాలు, గ్యాస్ లీకేజీలు, కెమికల్ విస్ఫోటనం వంటి ఘటనలు జరిగినప్పుడు తీవ్రంగా గాయపడిన వారికి అత్యాధునిక వైద్యం అందించేలా ఈ సెంటర్‌ను తీర్చిదిద్దుతారు. సాధారణ ఆస్పత్రుల్లో అందించే సేవలతో పోలిస్తే ఇక్కడ మెరుగైన వైద్యం అందుతుంది. దీనివల్ల వేగంగా కోలుకునే అవకాశం ఉంటుంది. విశాఖ జిల్లాలో అనేక పరిశ్రమలు ఉండడంతో రాష్ట్ర ప్రభుత్వం సెంటర్ ఏర్పాటుకు విమ్స్‌ను ఎంపిక చేసింది. ముఖ్యంగా ఈ సెంటర్ లో మూడు రకాల వైద్య సేవలు అందుతాయి. ఎల్‌జీ పాలిమర్స్ వంటి ఘటనలు చోటుచేసుకున్నప్పుడు సెకండరీ లెవెల్ కెమికల్ విభాగంలో ఉండే వైద్య సిబ్బంది సేవలు అందిస్తారు. గ్యాస్ ... మిగతా 6వ పేజీలో

నేడు రక్షణ శాఖా మంత్రి రాక



విశాఖపట్నం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రక్షణ శాఖా మంత్రి రాజనాథ్‌సింగ్ మంగళవారం నగరానికి రానున్నారు. ఆయన మంగళవారం ఉదయం 9.30 గంటలకు డిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి 11.30 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి 11.55 గంటలకు వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాకు చేరుకుని బీజేపీ ఏర్పాటుచేసే మేధావుల సమావేశంలో పాల్గొంటారు. సమావేశం అనంతరం తిరిగి మధ్యాహ్నం 1.05 గంటలకు బయలుదేరి 1.25 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకుని గన్నవరం బయలుదేరి వెళతారు.

నేటి నుంచి టెట్

ఉమ్మడి జిల్లాలో 37,556 మంది అభ్యర్థులు

తొమ్మిది కేంద్రాలు ఏర్పాటు

విశాఖపట్నం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) మంగళవారం నుంచి జిల్లాలోని తొమ్మిది కేంద్రాల్లో ప్రారంభం కానున్నది. వచ్చే నెల ఆరో తేదీ వరకూ ప్రతిరోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటలు, 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు రెండు సెషన్‌లలో జరగనున్నది. ఆన్‌లైన్‌లో కంప్యూటర్ బేస్డ్ విధానంలో జరగనున్న ఈ పరీక్షకు ఉమ్మడి విశాఖపట్నం జిల్లా నుంచి 37,556 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. పరీక్ష కేంద్రాలుగా గాయత్రి ఇంజనీరింగ్ కళాశాల (మధురవాడ), చైతన్య ఇంజనీరింగ్ కళాశాల (కొమ్మాది), నోబెల్ ఇంజనీరింగ్ కళాశాల (లంకెలపాలెం దరి మంత్రిపాలెం),ఐయాన్ డిజిటల్ జోన్ -1,2 (చిన ముషిడివాడ), ఐయాన్ డిజిటల్‌జోన్ (షీలానగర్), జెన్ టెక్నాలజీస్ (చాణక్యనగర్, చినముషిడివాడ), ఎస్‌వీఎస్ టెక్నాలజీస్(బీసీ రోడ్,పెదగంట్యాడ), ఏడీజడ్ డిజిటల్ జోన్ (శివాలయం ఎదురుగా, బుచ్చిరాజుపాలెం) ను ఎంపిక చేశారు. అభ్యర్థులు గంట ముందు కేంద్రానికి చేరుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు.

ఫ్లూ పరేషాన్

నగరంలో పెరుగుతున్న జ్వరాలు

- దగ్గు, జలుబు, ఒళ్లునొప్పులు వంటి లక్షణాలు
- గడచిన పది రోజుల నుంచి రెట్టింపు కేసులు రాక
- డయేరియా కూడా...
- కలుషిత నీరు, ఆహారం తీసుకోవడమే కారణం
- అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న వైద్యులు



విశాఖపట్నం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఫ్లూ వైరస్ వ్యాప్తి చెందుతోంది. వాతావరణంలో మార్పుల కారణంగా ఫ్లూ వైరస్ యాక్టివ్ అయ్యి జ్వరాల బారినపడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. జ్వరంతో పాటు ఎక్కువ మందిలో జలుబు, గొంతునొప్పి, గవదలు, ఒళ్లు నొప్పులు, వాంతులు, విరేచనాలు వంటివి కనిపిస్తున్నాయి.

చిన్నారుల్లో గొంతునొప్పి, జ్వరం, విరేచనాల సమస్య అధికంగా ఉంటోంది. గడిచిన వారం రోజుల నుంచి ఈ తరహా లక్షణాలతో వస్తున్న రోగుల సంఖ్య పెరిగినట్టు వైద్యులు చెబుతున్నారు. కొద్దిరోజులుగా ఎండ తీవ్రత పెరిగింది. సీజన్ మారుతున్న క్రమంలో ఫ్లూ వైరస్ యాక్టివ్ అయ్యిందని, దీనివల్ల జ్వరాలు వస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. లక్షణాలు మూడు నుంచి ఐదు రోజులు ఉంటాయని..అంతకు మించి ఉంటే మాత్రం వైద్యులను సంప్రతించాలని సూచిస్తున్నారు.

ఇక నగరంలో డయేరియా కూడా కనిపిస్తోంది. కలుషిత ఆహారం, నీరు తీసుకోవడం కారణంగా వైద్యులు చెబుతున్నారు. ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు బయట చల్లని పానీయాలు తీసుకోవడం వల్ల ఈ తరహా ఇబ్బందులు తలెత్తుతాయని, చిన్నారులు, వృద్ధుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. కాచి, చల్లార్చిన నీళ్లను తీసుకోవడం వల్ల ఈ సమస్యకు చెక్ చెప్పవచ్చునని చెబుతున్నారు. వీలైనంత వరకు బయట ఆహారానికి దూరంగా ఉంచాలని సూచిస్తున్నారు.

మరిన్ని కేసులు పెరిగే చాన్స్

సీజన్ మారుతున్న క్రమంలో ఎండ వేడి ఇప్పుడిప్పుడే పెరుగుతోంది. మరో రెండు నుంచి మూడు వారాలపాటు జ్వరాలు అధికంగా ఉండే అవకాశముందని చెబుతున్నారు. గతంతో పోలిస్తే చిన్నారుల్లో డయేరియా సమస్య ఇప్పుడు ఎక్కువగా కనిపిస్తున్నట్టు వైద్యులు చెబుతున్నారు. అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. జ్వర లక్షణాలతో సాధారణ రోజుల్లో 20 మంది వరకు వస్తే, గడిచిన పది రోజుల నుంచి ఈ సంఖ్య 40 వరకు పెరిగిందని డాక్టర్ జ్ఞానసుందరరాజు తెలిపారు. ఆహారం, నీటి విషయంలో జాగ్రత్తలు ... మిగతా 6వ పేజీలో

వాల్తేరు డివిజన్ పరిధిలో 12 రైల్వే స్టేషన్‌ల అభివృద్ధి

వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన ప్రధాని నరేంద్రమోదీ





వర్చువల్ విధానంలో ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ, శిలాఫలాకల్ని ఆవిష్కరిస్తున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ తదితరులు

గోపాలపట్నం, ఫిబ్రవరి 26: వాల్తేరు డివిజన్ పరిధిలో 12 రైల్వే స్టేషన్‌ల అభివృద్ధి, 4 రోడ్డు ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి ప్రధాని నరేంద్రమోదీ సోమవారం వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. ఈ మేరకు స్థానికంగా అధికారులు సింహాచలం రైల్వే స్టేషన్‌లో కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ మాట్లాడుతూ అమృత్ భారత్‌లో భాగంగా వాల్తేర్ డివిజన్ పరిధిలో గల సింహాచలం, అరకులోయ, కొత్తవలస, పార్వతీపురం, బొబ్బిలి, చీపురుపల్లి, శ్రీకాకుళం రోడ్, నౌపాడ, పర్లాకిమిడి, రాయగడ, కోరాపుట్, జైపూర్, తదితర స్టేషన్‌లను అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. అదేవిధంగా విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో నాలుగు రోడ్డు ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం చేపట్టనున్నట్టు తెలిపారు. స్టేషన్ల అభివృద్ధికి రూ.443.47 కోట్లు, నాలుగు ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి రూ.218.13 కోట్లు వెచ్చించనున్నట్టు చెప్పారు. డిల్లీలో ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేపట్టగా రైల్వే అధికారులు, ప్రజా ప్రతినిధులు సింహాచలం రైల్వే స్టేషన్‌లో శిలాఫలకాల్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రధాని మోదీ ప్రసంగాన్ని వర్చువల్ విధానంలో ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పి.గణబాబు, మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, పద్మశ్రీ డాక్టర్ కూటికుప్పల సూర్యారావు, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉత్తరాంధ్రలో నారా భువనేశ్వరి పర్యటన



విశాఖపట్నం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): 'నిజం గెలవాలి' (చంద్రబాబునాయుడు అరెస్టు కావడాన్ని తట్టుకోలేక మృతిచెందిన కార్యకర్తల కుటుంబాలను ఓదార్పు) కార్యక్రమం లో భాగంగా తెలుగుదేశం అధినేత సతీమణి నారా భువనేశ్వరి మంగళవారం నుంచి ఒకటో తేదీ వరకు ఉత్తరాంధ్రలో పర్యటించనున్నారు. ఆమె మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. ఇక్కడ నుంచి నేరుగా పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు వెళతారు. కార్యకర్తల కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందిస్తారు. మంగళవారం రాత్రికి అరకులోయ చేరుకుని బస చేస్తారు. బుధవారం అరకులోయ, పాడేరు నియోజకవర్గాల్లో కార్యకర్తల కుటుంబాలను కలిసి ఆర్థిక సాయం అందించి రాత్రికి నర్సీపట్నం చేరుకుని బస చేస్తారు. ఈనెల 29వ తేదీన నర్సీపట్నం, చోడవరం, ఎలమంచిలి నియోజకవర్గాల్లో పర్యటించి రాత్రికి అనకాపల్లి చేరుకుంటారు. మార్చి ఒకటో తేదీన అనకాపల్లి, ఎలమంచిలి నియోజకవర్గాల్లో కార్యకర్తల కుటుంబాలను పరామర్శించి సాయం అందజేస్తారు. అక్కడ నుంచి విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుని విమానంలో చెన్నై వెళతారు.



నరసింహనగర్‌లో రోడ్డుపై ఏర్పాటు చేసిన బడ్డీలు



రహదారిపై టీ, పండ్ల దుకాణాలు

రహదారులపై దుకాణాలు

- నరసింహనగర్ మార్గంలో బడ్డీల ఏర్పాటు
- రాకపోకలకు తీవ్ర అవస్థలు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 26 : గ్రేటర్ 14, 45వ వార్డుల పరిధి నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని ఉన్న నరసింహనగర్ రహదారిని ఆక్రమించి బడ్డీలు వెలిశాయి. దీంతో రాకపోకలకు వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. గతంలో ఈ రోడ్డుపై చేపలు విక్రయించే వ్యాపారుల మాత్రమే ఉండేవారు. ప్రస్తుతం రోజురోజుకు ఇనుపబడ్డీలు తయారు చేయించి అక్కడ పెట్టి వివిధ వ్యాపారాలు సాగిస్తున్నారు. అలాగే, ఈ దుకాణాల వద్దకు వచ్చిన వినియోగదారులు రోడ్డుపైనే పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్‌కు ఆటంకం కలుగుతోందని పలువురు పాదచారులు, వాహనచోదకులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ మార్గంలో రెండు కళాశాలలున్నాయి. ఇవి విడిచిపెట్టిన సమయంలో విద్యార్థులు లోనించి నుంచి బయటకు రావడానికి అవస్థలు పడుతున్నారు. అంతేకాకుండా అక్కయ్యపాలెం నాలుగు లేన్ల రహదారి బస్టాప్ వెనుక ఉన్న ఖాళీ స్థలంలో లక్షలాది రూపాయల వ్యయంతో పార్కు, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. దానికి ఎదురుగా కూడా బడ్డీలు ఏర్పాటు చేశారు. దీంతో పాటు అక్కడే ఇసుక వేసి ఆటోల ద్వారా విక్రయిస్తున్నారు. ఇంతగా ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నా జీవీఎంసీ అధికారులు పట్టించుకోకపోవడం ఎంతవరకు సమంజసమని పరిసర ప్రాంతాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రహదారిపై ఏర్పాటు చేసిన బడ్డీలపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

అంతర్ కళాశాలల క్రికెట్ విజేత ఏఎంసీ



జట్టు సభ్యులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు తదితరులు

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఫిబ్రవరి 26: వైఎస్సార్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ అంతర్ వైద్య కళాశాలల క్రికెట్ టోర్నీలో ఆంధ్ర మెడికల్ కాలేజీ (ఏఎంసీ) చాంపియన్‌గా నిలిచింది. రాజమండ్రిలో జరిన ఈ టోర్నీ ఫైనల్స్‌లో ఆంధ్ర మెడికల్ కాలేజీ పది పరుగుల తేడాతో ఆతిథ్య జీఎస్ఎల్ జట్టుపై విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఏఎంసీ నిర్ణీత 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లకు 119 పరుగుల చేయగా, లక్ష్య ఛేదనలో జీఎస్ఎల్ నిర్ణీత 20 ఓవర్లలో ఎనిమిది వికెట్లకు 108 పరుగులు చేసి ఓటమి చెందింది. సోమవారం ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు తన కార్యాలయంలో టీం కెప్టెన్ కేవీ అభిషేక్‌తోపాటు జట్టు సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ స్పోర్ట్సు వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్.సునీల్‌కుమార్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎంఎస్ఎస్.పాత్రుడు పాల్గొని క్రీడాకారులను అభినందించారు. మరిన్ని విజయాలు సొంతం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

ఫ్లూ పరేషాన్

... 5వ పేజీ తరువాయి

తీసుకోవాలని ఆయన సూచించారు.

అనవసరమైన మందులు వాడొద్దు..ఐదు రోజుల్లో నయం

- డాక్టర్ సోమయాజులు, జనరల్ ఫిజీషియన్

ఫ్లూ వైరస్ కారణంగా జ్వరాలు ఎక్కువ కనిపిస్తున్నాయి. గడచిన పది రోజుల రెండు రెట్లు అధికంగా కేసులు నమోదవుతున్నాయి. జ్వరం, దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలు ఉంటున్నాయి. ఐదు రోజుల్లో జ్వరం తగ్గుముఖం పడుతుంది. పారాసిట్మాల్ వేసుకుంటే సరిపోతోంది. ఐదు రోజులకు మించి లక్షణాలు ఉంటే మాత్రం వైద్యుల సలహాతో పరీక్షలు చేయించుకోవాలి. ఫ్లూయిడ్స్ గానీ, ఇతర మందులు గానీ వైద్యులు సూచనకు అనుగుణంగా వినియోగించడం మంచిది. వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఎక్కువ నీళ్లు తాగడం మేలు. రానున్న రోజుల్లో రకరకాల వైరస్‌లు మరింత యాక్టివ్ అయి వ్యాధుల వ్యాప్తికి కారణమవుతాయి. తగిన జాగ్రత్తలు తీసుకోవడం ఉత్తమం.

వైసీపీ నేతల గుప్పిట్లో ఫిల్మ్‌నగర్ క్లబ్!

... 5వ పేజీ తరువాయి

ధరకు భూమిని ఇప్పించకుండా మొత్తం సొమ్ము వెచ్చించి భూమి కొనడం ఏమిటని ప్రశ్నించారు. దాంతో కమిటీ పెద్దలు తాత్కాలికంగా ఒక అడుగు వెనక్కి తగ్గినా..ఇప్పుడు మరో రెండేళ్ల అధికారం చేతికి రావడంతో భీమిలిలో భూమి కొనుగోలుకు ప్రయత్నించే అవకాశం ఉందని సభ్యులు ఆరోపిస్తున్నారు. కొనాలనుకుంటున్న భూమికి సంబంధించి వివాదాలు ఉన్నాయని, సరైన మార్గం కూడా లేదని అంటురు. ముందు రూ.10 కోట్లు అడ్వాన్స్ ఇచ్చి, పొజిషన్ తీసుకున్నాక తీరుబడిగా మిగిలిన మొత్తం చెల్లించవచ్చునని కమిటీ పెద్దలు చెబుతున్నారు. కానీ, పూర్తి మొత్తం తీసుకోకుండా ఏడు ఎకరాల భూమి ఎలా అప్పగిస్తారని కొందరు సందేహం వ్యక్తంచేస్తున్నారు. అయితే సభ్యులు ఏమి మాట్లాడినా అధికార పార్టీ టార్గెట్ చేస్తుందనే భయంతో ఎవరూ నోరు విప్పడం లేదు. కొత్త కార్యవర్గం విశాఖను ఫిల్మ్ మేకింగ్, స్టూడియోలకు హబ్‌గా మార్చేందుకు కృషిచేస్తామని ప్రకటించింది. అయితే సినిమా రంగానికి చెందిన వారెవరికీ ఇందులో కీలక స్థానం కల్పించలేదు. అధికార పార్టీ నాయకులకు అనుయాయులుగా సమాజంలో ముద్రపడిన వారే పీఠం దక్కించుకున్నారు. వీరు సినిమా రంగాన్ని ఎలా అభివృద్ధి చేస్తారని, ఈ రెండేళ్ల ఏమి చేశారని సభ్యులు ప్రశ్నిస్తున్నారు. రాజకీయాలకు అతీతంగా ఉండే పరిశ్రమను సైతం కలుషితం చేశారని కొందరు వాపోతున్నారు. నగరంలో కొందరు ప్రముఖులు చిత్ర పరిశ్రమతో సంబంధం ఉన్నవారు రెండేళ్ల క్రితమే సభ్యత్వం కోసం డబ్బులు చెల్లిస్తే వారికి ఇప్పటికి కూడా కార్డులు ఇవ్వలేదు. వారికి ఎన్నికల్లో భాగస్వామ్యం కల్పించలేదు. ఈ క్లబ్‌లో ఏదీ నిబంధనల ప్రకారం జరగడం లేదని, ఇది కమిటీ క్లబ్బే తప్ప సభ్యులది కాదని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. కమిటీకి అనుకూలంగా బైలాను మార్పు చేసుకున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

సీబీఆర్ఎన్ మెడికల్ మేనేజ్‌మెంట్ సెంటర్ ఏర్పాటు ఎన్నడో?

... 5వ పేజీ తరువాయి

పేలుడు, కొవిడ్ వంటి వైరస్‌లు వ్యాప్తి చెందినప్పుడు బయోలాజికల్ విభాగానికి చెందిన బృందం, పరిశ్రమల్లో రేడియేషన్‌కు సంబంధించిన పదార్థాల పేలుడు జరిగినప్పుడు రేడియోలాజికల్ విభాగం సిబ్బంది సేవలు అందిస్తారు. ఇందుకుగాను విమ్స్ వైద్యులకు నాలుగు నెలల కిందట తమిళనాడులో అడ్వాన్స్‌డ్ శిక్షణను అందించారు. ఈ సెంటర్ ఏర్పాటులో భాగంగా విమ్స్‌లో ప్రత్యేకంగా న్యూక్లియర్ బ్లాక్‌ను ఏర్పాటుచేయనున్నారు. కానీ, ఆశించిన స్థాయిలో పనులు ప్రారంభం కాకపోవడంతో ఈ సెంటర్ ఏర్పాటుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 26: వడ్డాదిలో విద్యుదాఘాతానికి గురై ఓ బాలుడు మృతి చెందాడు. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. రాజస్థాన్‌కి చెందిన జాలంసింగ్, అతని సోదరుడు చందనసింగ్ రాథోడ్ వడ్డాదిలో హార్డ్‌వేర్, ప్లంబింగ్ వ్యాపారం చేస్తున్నారు. జాలంసింగ్‌కి ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు యువరాజ్‌సింగ్ రాథోడ్(10) ఓ ప్రైవేటు స్కూల్‌లో ఐదవ తరగతి చదువుతున్నాడు. పెద్ద కుమారుడికి ఎఫ్ఏ-4 పరీక్షలు జరుగుతుండడంతో ఆ బాలుడిని జాలంసింగ్ తన సోదరుడి ఇంటి వద్ద వదిలి బంధువుల వివాహానికి భార్య చిన్న కుమారుడితో రాజస్థాన్ వెళ్లాడు. సోమవారం సాయంత్రం బాబాయి ఇంటి మేడపై ఆడుకుంటున్న యువరాజ్ సింగ్ ఇంటికి సమీపంలో ఉన్న విజయరామరాజుపేట ఫీడర్ 11 కేవీ లైన్ వైర్లును పట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురై పెద్దగా కేకలు పెట్టాడు. కేకలు విన్న బాబాయ్ చందన సింగ్ రాథోడ్ కర్రతో యువరాజ్‌సింగ్ రాథోడ్‌ని కొట్టి వైర్లు నుంచి తప్పించాడు. చికిత్స కోసం తరలిస్తుండగా మార్గమధ్యంలో ఆ బాలుడు మృతి చెందాడు.

లారీని ఢీకొన్న వ్యాన్.. నలుగురికి తీవ్ర గాయాలు

కశింకోట, ఫిబ్రవరి 26: జాతీయ రహదారిపై మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్ఐ రమేశ్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం దిబ్బిలివీధికి చెందిన అరుగురు వ్యక్తులు అన్నవరం పుణ్య క్షేత్రానికి టాటా ఏస్ వ్యాన్‌లో వెళ తున్నారు. కశింకోట వచ్చే సరికి ముందు వెళుతున్న లారీ డ్రైవర్ ఆకస్మికంగా బ్రేకులు వేశాడు. దీంతో లారీ వెనుక భాగాన్ని వ్యాన్ ముందు భాగం ఢీకొన్నది. ఈ ప్రమాదంలో అమనాన చక్రపాణి, అమనాన భాగ్యరేఖ, సకలబత్తుల పావని, అలుపాని శ్రీనివాస రావు(డ్రైవర్) తీవ్రంగా గాయపడ్డారు. హైవే పెట్రోలింగ్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని 108 అంబులెన్స్‌లో క్షతగాత్రులను అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

డాబాగార్డెన్స్ రహదారికి మరమ్మతులు



గోతులు పూడ్చిన మెయిన్ రోడ్డు

డాబాగార్డెన్స్, జనవరి 26: గ్రేటర్ 31వ వార్డుకు చెందిన డాబాగార్డెన్స్ మెయిన్‌రోడ్డులో గోతులను ఎట్టకేలకు పూడ్చారు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన కథనాలపై సంబంధిత అధికారులు స్పందించారు. ఆయా ప్రాంతాల్లోని రహదారికి మరమ్మతులు చేపట్టారు. ఎల్ఐసీ సర్కిల్ చుట్టూ నిత్యం వాహనదారులు, ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. అక్కడ ఉన్న గోతులలో పడి పలువురు ప్రమాదాలకు గురయ్యేవారు. దీంతో ఇప్పుడు మరమ్మతులు చేపట్టడంపై ప్రయాణికులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

స్విమ్మింగ్‌లో గ్రీష్మిణికి పతకాల పంట



పతకాలతో గ్రీష్మిణి

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఫిబ్రవరి 26: ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ టోర్నీలో నగరానికి చెందిన వి. నాగ గ్రీష్మిణి రెండు స్వర్ణ, రెండు కాంస్య పతకాలు సాధించారు. గుహవటిలో జరిగిన ఈ టోర్నీలో గ్రీష్మిణి అద్భుతమైన ప్రతిభ ప్రదర్శించి 50మీ. బ్రెస్ట్ స్ట్రోక్, 100మీ. బ్రెస్ట్ స్ట్రోక్‌లలో స్వర్ణ పతకాలు కైవసం చేసుకోగా 4×200 (ప్లస్ గుర్తును ఇంటుగా మార్చగలరు) ఫ్రీ స్టైల్ రిలే, 4×100 మెడ్లీ రిలే ఈవెంట్లలో కాంస్య పతకాలు సాధించారు. ఈసందర్భంగా స్విమ్మింగ్ సంఘం కార్యదర్శి మోహన్ వెంకట్‌రామ్, కోచ్ నాయుడు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

'దక్షిణ' టికెట్ కేటాయించరూ..

- టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్



చంద్రబాబుకు పుష్పగుచ్ఛమిస్తున్న నజీర్

మహారాణిపేట, ఫిబ్రవరి 26: శాసన సభ్యునిగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడును కోరారు. సోమవారం ఉండవల్లిలో చంద్రబాబును ఆయన మర్యాపూర్వకంగా కలసి ఈ మేరకు విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా విశాఖలోని రాజకీయ పరిస్థితులను వివరించారు. గత 30 సం వత్సరాలుగా పార్టీని నమ్ముకుని సేవలు అందిస్తున్నానని, ముస్లిం మైనారిటీ కోటాలో దక్షిణ నియోజకంలో శాసన సభ్యునిగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని నజీర్ కోరారు.

ఉత్తర టీడీపీ ఇన్‌చార్జిగా నియమించాలి: అకిరెడ్డి

అక్కయ్యపాలెం: ఉత్తర నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్‌గా తనను నియమించాలని విశాఖ పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రటరీ, 42వ వార్డు సీనియర్ నాయకుడు అకిరెడ్డి జగదీష్ కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం విశాఖ పార్లమెంటరీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌కు దరఖాస్తు అందజేశారు. కొద్దిరోజుల క్రితం మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావుకు కూడా దరఖాస్తు అందజేసినట్లు చెప్పారు. పల్లా శ్రీనివాస్‌ను కలిసి దరఖాస్తు అందజేసిన వారిలో వార్డు టీడీపీ ప్రధాన కార్యదర్శి ముక్కి రామకృష్ణ, నాయకులు ఎం.శ్రీకృష్ణ, ఎంఎల్ఎస్ రావు ఉన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సీతమ్మధార, ఫిబ్రవరి 26: విద్యుత్ హెచ్చు తగ్గులు తగ్గించే నిమిత్తం నక్కవానిపాలెం ఫీడర్ పరిధి చేపడుతున్న పనుల నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ జోన్ 1 ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. నక్కవానిపాలెం, సత్యం కూడలి, జీవీఎంసీ ప్రైమరీ స్కూల్ ప్రాంతం, రిసోనాన్స్ స్టడీ సెంటర్, శారద స్కూల్ ప్రాంతం, శివాలయం వీధి, వివేకానంద కళ్యాణ మండపం ప్రాంతంలోని వినియోగదారులు సహకరించాలని కోరారు.

బుద్ధుని బోధనలతో సమాజ మార్పు

- బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రతినిధులు



ఎన్నికైన నూతన కమిటీ ప్రతినిధులు

సీతంపేట, ఫిబ్రవరి 26: బుద్ధుని సిద్ధాంతాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి సమాజంలో మార్పు తీసుకురానున్నామని బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రతినిధులు తెలిపారు. రామాటాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో నిర్వహిస్తున్న 11వ బౌద్ధ మహాసమ్మేళనంలో భాగంగా రెండో రోజైన సోమవారం జాతీయ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించి నూతన కేంద్ర కమిటీని ట్రస్టీ ప్రతినిధులను ఎన్నుకున్నారు. ట్రస్టీ జాతీయ అధ్యక్షుడిగా చంద్ర బోధి పాటిల్, ట్రస్టీ ప్రధాన కార్యదర్శిగా బీకే బరేవ్, కోశాధికారిగా శంకరరావు దొంగేరెలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన నూతన కమిటీ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కలలు గన్న ప్రబుద్ధ భారత్ నిర్మాణానికి కృషి చేస్తామనిఈ సందర్భంగా పేర్కొన్నారు. బుద్ధిని జీవితం, బోధనలు నేటి తరానికి ఆదర్శనీయమన్నారు. ఆయన బాటలో పయనిస్తే సమాజ పురోభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.

ఔషధ మొక్కల పెంపకంతో లాభాలు



మాట్లాడుతున్న డా. బృందావనం

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 26: అటవీ ఔషధ మొక్కల పెంపకం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని బయోడైవర్సిటీ ఎక్స్‌పర్ట్ డాక్టర్ ఎన్.బి.బృందావనం అన్నారు. అటవీ ఔషధ మొక్కల సేకరణ పద్ధతులపై క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా , ఆంధ్రప్రదేశ్ ఔషధ , సుగంధ మొక్కల బోర్డు ఆధ్వర్యంలో ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని డాబాగార్డెన్స్‌లోని ఓ హాల్‌లో సోమవారం నిర్వహించారు. గిరిజన ఔత్సాహికులు పాడేరు, సీతంపేట, అరకు, పార్వతీపురంమాన్యం, విజయనగరం తదితర ప్రాంతాల నుంచి పాల్గొన్నారు. బృందావనం ముఖ్య అతిథిగా హాజరై అటవీ ఉత్పత్తుల సేకరణపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా న్యూఢిల్లీ ఎం.జంగయ్య, ఎం.విజయకుమార్, సీహెచ్ దుర్గాప్రసాద్, జి.కృష్ణశ్రీ, ఎం.ప్రణీత, కల్యాణి, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినిపై పీఈటీ అఘాయిత్యం

- నిందితుడి అరెస్టు, రిమాండ్‌కు తరలింపు
- పోక్సో చట్టం కింద కేసు నమోదు

విశాఖపట్నం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): విశాఖలో మరో దారుణం వెలుగుచూసింది. కార్పొరేట్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థినిపై అదే పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు (పీఈటీ)గా పనిచేస్తున్న వ్యక్తి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. బాలిక గర్భం దాల్చడంతో కీచక ఉపాధ్యాయుడి బాగోతం బయటపడింది. దీనికి సంబంధించి పీఎం పాలెం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మధురవాడ ప్రాంతంలోని ఒక కార్పొరేట్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న బాలికను పీఈటీ మాయమాటలు చెప్పి లొంగదీసుకున్నాడు. సెలవు రోజుల్లో ప్రత్యేక శిక్షణ తరగతులు ఉన్నాయంటూ బాలికను పాఠశాలకు పిలిపించి అఘాయిత్యానికి పాల్పడేవాడు. ఈ క్రమంలో బాలికకు రెండు రోజుల కిందట కడుపునొప్పి రావడంతో తల్లిదండ్రులు సమీపంలోని ఆస్పత్రికి తీసుకువెళ్లారు. బాలికను పరీక్షించిన వైద్యులు...గర్భవతిగా నిర్ధారించడంతో పోలీసులకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా రిమాండ్‌కు ఇచ్చినట్టు పోలీసులు తెలిపారు. అతనిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

'అత్యాచార కేసులో నిందితుడైన డ్రిల్‌మాస్టర్‌ను శిక్షించాలి'

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 26: విద్యార్థినిపై అత్యాచారం చేసిన మధురవాడలోని ఓ కార్పొరేట్ పాఠశాల పీఈటీపై కఠినంగా శిక్షించి, ఆ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని మహిళా చేతన ప్రధాన కార్యదర్శి కె.పద్మ డిమాండ్ చేశారు. సోమవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నిందితుడిపై ఇప్పటికే పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదైందన్నారు. అత్యాచార నిరోధక చట్టం 376కు వచ్చిన సవరణ, సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్‌ను అనుసరించి పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈవిషయంపై కలెక్టర్ పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో పీకేఎస్ కార్యదర్శి అన్నపూర్ణ, ఎ.సత్యవతి, కె.లావణ్య తదితరులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యంతో జీవితంలో రాణింపు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 26: ప్రతి విద్యార్థీ ఏదైనా వృత్తిలో నైపుణ్యం పెంపొందించుకుని జీవితంలో రాణించాలని విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.శోభారాణి తెలిపారు. కళాశాలలో స్కిల్‌హబ్‌లో అసోసియేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులను రెండు బ్యాచ్‌లను మూడు నెలల కాల వ్యవధిలో పూర్తి చేసిన విద్యార్థినులకు సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. విద్యారులు చదువుతోపాటు ఇతర వృత్తులను నేర్చుకుంటే భవిష్యత్తులో స్వయం ఉపాధికి వీలుంటుందన్నారు. ఈ క్రమంలో విద్యా విధానంలో మార్పులు చేసుకుంటున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి, బి.హైమావతి, కె.ప్రశాంతి, బి.సునీల్, ఎస్.కనమహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఫ్లోటింగ్ బ్రిడ్జికి ఒక్కరోజు వ్యాలిడిటీ

- ట్విట్టర్‌లో మాజీ మంత్రి గంటా ఎద్దేవా

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 26 : విశాఖ ఆర్కే బీచ్‌లో సముద్రంపై నిర్మించిన ఫ్లోటింగ్ బ్రిడ్జి ఒక్కరోజు వ్యవధిలోనే కూలిపోవడం దారుణమని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ట్విట్టర్‌లో విమర్శించారు. ఎంతో ఆర్భాటంగా 1.60 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ వంతెన ఒక్కరోజు వ్యాలిడిటీతో ఈ ప్రభుత్వ పనితనం ఏమిటో మరోసారి రుజువైందన్నారు. కొద్దిరోజుల కిందట విశాఖ నగరంలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన మోడల్ బస్ షెల్టర్ నాలుగు రోజులకే కుప్పకూలిందని గుర్తు చేశారు. ప్రతిదీ ఇలా నిర్మించడం.. ఆ వెనువెంటనే కూలిపోవడం ఆనవాయితీగా మారిందని ఎద్దేవా చేశారు. ప్రచారాలకు తప్ప అభివృద్ధికి, ఇతర నిర్మాణాలకు పనికిరాని ప్రభుత్వమని మరోసారి నిరూపితమైందని పేర్కొన్నారు. 'ఒక చిన్న బస్‌షెల్టర్, ఫ్లోటింగ్ బ్రిడ్జి సక్రమంగా నిర్మించలేని వాళ్ల రాజధాని, పోలవరం నిర్మిస్తారట.. జగనన్న' అని జనాలు నవ్వుకుంటున్నారన్నారు. ప్రజలంతా గమనిస్తూనే ఉన్నారు. ఈ ప్రచారాల ప్రభుత్వానికి ఇక సమయం 50 రోజులే ఉందని హెచ్చరించారు. ప్రజలు బై జగన్‌కు చెప్పాల్సిన సమయం వచ్చేసిందన్నారు.

యువగళం పథకంతో యువతకు భవిష్యత్తు

టీడీపీ ప్రవేశపట్టనున్న యువగళం పథకంతో యువత భవిష్యత్‌కు గ్యారెంటీ లభిస్తుందని మాజీమంత్రి గంటా శ్రీనివాస్ అన్నారు. యువగళం పాదయాత్రలో భాగంగా రాష్ట్రమంతా తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకున్న పార్టీ యువనేత నారా లోకేశ్ సూచనలతో పథకాన్ని అమలు చేయనున్నారన్నారు. యువతే దేశానికి బలమని, రాష్ట్రాభివృద్ధిలోనూ వారి పాత్ర ఎంతో కీలకమన్నారు. ప్రపంచంలోనే అత్యధిక శాతం మంది యువత ఉన్న దేశం భారత్ అని తెలిపారు. యువత తలుచుకుంటే ఏదైనా సాధ్యమేనని అన్నారు. అవినీతి ని అంతం చేయాలన్నా, అభివృద్ధికి బాటలు వేయాలన్నా, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలన్నా యువతే కీలకమన్నారు.

'లక్ష ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వాలి'

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 26: ఎన్నికల కోడ్ వచ్చే లోగా లక్ష ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగున్నరేళ్లుగా అనేక పోస్టులను భర్తీ చేయకుండా నిర్లక్ష్యం వహించిందన్నారు. అలాగే, రెండు రోజుల కింద జరిగిన గ్రూప్-2 పరీక్షలో జాగ్రఫీ కొంత ఇబ్బంది పెట్టిందన్నారు. ఇండియన్ సొసైటీలో ఎక్కువగా సోషియాలజీకి సంబంధించిన లా, సెక్షన్స్ అడిగారని, ఇది గ్రూప్-2 అభ్యర్థుల స్థాయికి మించి ఉన్నట్టు ఆయన తెలిపారు. కరెంట్ అఫైర్స్‌లో ప్రస్తుత పరిస్థితులు అడగకుండా చరిత్రకి సంబంధించి ఇవ్వడం ఇదే మొదటిసారని పేర్కొన్నారు. సచివాలయం తరహాలో క్వాలిఫైయింగ్ మార్కులుంటే అభ్యర్థులు అర్హత సాధించలేకపోవడం వల్ల గ్రేస్ మార్కులు అడగడం ప్రారంభిస్తారని చెప్పారు. ఈ ప్రశ్నపత్రాన్ని బట్టి బీసీలకు 70 మార్కుల లోపు కట్ఆఫ్ ఉంటుందని, బీసీలకు 60, ఎస్సీ ఎస్టీలకు 50 కట్ఆఫ్ ఉండవచ్చని అంచనా వేశారు.

ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు

మహారాణిపేట, ఫిబ్రవరి 26: జిల్లా వ్యాప్తంగా ఈనెల 26వ తేదీనుంచి మార్చి 1 వ తేదీ వరకు ఆర్థిక అక్షరాస్యతా వారోత్సవాలు జరగనున్నట్లు జాయింట్ కలెక్టర్ మయూరి అశోక్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎల్‌డీఎం ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు 2024 -25 సంవత్సరాలకు సంబంధించి భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఆదేశాల మేరకు ఎస్‌బీఐ ఆధ్వర్యంలో జిల్లాలో వారోత్సవాలు నిర్వహి స్తున్నట్లు చెప్పారు.

పోలీసు అదుపులో ఆరుగురు పేకాటరాయుళ్లు

మహారాణిపేట, ఫిబ్రవరి 26: మహారాణిపేట పోలీసు స్టేషన్ పరిధి రామజోగిపేట ప్రాంతంలో సోమవారం టాస్క్ ఫోర్సు పోలీసులు దాడులు జరిపి పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1.15 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. మహారాణిపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి: డీఈవో

మహారాణిపేట, ఫిబ్రవరి 26: మహారాణిపేట మండలంలోని ప్రత్యేక అవస రాలు గల పిల్లలను ఉద్దేశించి భవిత సెంటర్లను ఏర్పాటు చేసినట్టు డీఈవో చంద్రకళ పేర్కొన్నారు. సోమవారం ఆమె ఈ మేరకు నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు భవిత కేంద్రాల్లో వారంలో రెండు రెండు రోజుల పాటు ఫిజియోథెరపీతో పాటు బదిరులైన చిన్నారులకు స్పీచ్ థెరపీ నిర్వహించనున్నట్లు తెలిపారు. పిల్లలను తీసుకువచ్చి కేంద్రాల్లో అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీసీ శ్రీనివాస్ , గీతా తదితరులతో పాటు పలువురు పాల్గొన్నారు.

నిమ్మకాయల వ్యాపారులకు నష్టాలు



నరసింహనగర్ రైతుబజారులో విక్రయాలు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 26: వేసవిలో నిమ్మకాయలకు డిమాండ్ ఉంటుంది. ఎండల తాకిడినుంచి ఉపశమనం కోసం నిమ్మరసాన్ని తాగాలని వైద్యులు సూచిస్తుంటారు. దీంతో వీటికి డిమాండ్ పెరిగింది. పంట దిగుబడి తక్కువ ఉండడంతో గూడూరు నుంచి నిమ్మకాయలను దిగుమతి చేసుకుని రైతుబజారులో విక్రయిస్తున్నారు. 45 కిలోల బస్తా రూ.5వేలకు అక్కడి నుంచి తీసుకువచ్చి విక్రయించాలంటే చాలా కష్టంగా ఉందని వ్యాపారులు అంటున్నారు. రైతుబజారులో కిలో రూ.110లకు వి క్రయించాలని బోర్డు పెట్టారని, ఆ ధరకు విక్రయించాలంటే తమ కు నష్టం వస్తోందని వాపోతున్నారు. అయినా, దిగుమతి అవుతున్న నిమ్మకాయలు బాగోలేకపోవడంతో వినియోగదారులు తక్కువ ధరకు అడుగుతున్నట్టు చెబుతున్నారు. దీంతో విక్రయాలు లేక ఆ సరకు అంతా కుళ్లిపోయి మరింత నష్టం వాటిల్లుతుందని వాపోతున్నారు. ఇకనైనా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులు స్పందించి నిమ్మకాయలకు గిట్టుబాటు ధర కల్పించేలా బోర్డు పెట్టాలని కోరుతున్నారు.

కార్మిక నేతలపై నిరసన గళం

నూతన వేతనాలను అమలు చేయించడంలో విఫలమయ్యారంటున్న ఉక్కు కార్మికులు



ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 26: స్టీల్‌ప్లాంట్ కార్మికులు వేతన సవరణ విషయంలో ఆయా కార్మిక సంఘాల నాయకులపై నిరసన గళమెత్తుతున్నారు. నూతన వేతనాలను అమలు చేయించడంలో కార్మిక సంఘాల నాయకులు విఫలమయ్యారంటూ పలువురు కార్మికులు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. ఉక్కు ఉద్యోగులకు 2016 డిసెంబరు 31తో వేతన సవరణ ముగిసింది. 2017 జనవరి ఒకటి నుంచి నూతన వేతనాలు అమలు కావాల్సి ఉంది. దీనిపై పలుమార్లు ఎన్‌జేసీఎస్ సమావేశాలు జరగడంతో 2021 అక్టోబరులో వేతన సవరణ విషయం ఓ కొలిక్కి వచ్చింది. అయితే దీనికి అప్పట్లో కొన్ని కార్మిక సంఘాలు అనుకూలంగా, మరికొన్ని సంఘాలు వ్యతిరేకతను వ్యక్తం చేశాయి. దీంతో ఈ ప్రక్రియ నిలిచిపోయింది. వేతన సవరణ మీ వల్లే కాలేదంటే.. మీ వల్లే అమలుకు నోచుకోలేదంటూ కార్మిక సంఘాల నేతలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారే తప్ప తమ సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని కార్మికులు వాపోతున్నారు. ధర్నాలు, ఆందోళనలు చేస్తున్నా ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారనే తప్ప సమస్య పరిష్కారంపై ఎవరూ దృష్టిసారించడం లేదని కార్మికులు మండిపడుతున్నారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు సెయిల్ కార్మికులకు అమలు చేసే విధానాలన్నీ అమలయ్యేవి. అయితే సెయిల్ కార్మికులకు నూతన వేతనాలు అందుతున్నా, ఉక్కు కర్మాగారంలో అమలుకు నోచుకోకపోవడంతో ఇంకా పోరాటాలు చేస్తూనే ఉన్నారు.

ఈ నేపథ్యంలో స్టీల్‌ప్లాంట్‌లో ఏ కార్మిక సంఘం సమావేశం నిర్వహించినా ఆయా నాయకులను కొంతమంది కార్మికులు నూతన వేతనాల అంశంపై ప్రశ్నిస్తున్నారు. అందుకు సమాధానం చెప్పలేక నాయకులు మిన్నకుండిపోతున్నారు. కొంతమంది నాయకులైతే కార్మికులకు సమాధానం చెప్పలేక వారిపై దురుసుగా ప్రవర్తిస్తున్నారని సమాచారం. కార్మిక నాయకులు తమను మభ్యపెడుతూ పబ్బం గడుపుకుంటున్నారే తప్ప నూతన వేతనాల అమలు కోసం పూర్తి స్థాయిలో కృషి చేయడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్టీల్‌ప్లాంటుపై రాష్ట్ర మంత్రులు స్పందించకపోవడం దారుణం

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ



దీక్షా శిబిరంలో పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 26: విశాఖ స్టీల్‌ప్లాంట్ స్థితిగతుల గురించి ఇతర రాష్ట్రాల మంత్రులు స్పందిస్తున్నా మన రాష్ట్రానికి చెందిన వారు చోద్యం చూస్తుండడం దారుణంగా ఉందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 1,110వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుతెన్నులు చూస్తుంటే ప్రజాస్వామ్యంలో వింత పోకడల్లా కనిపిస్తుందన్నారు. ప్రజా ఉద్యమాలకు విలువ ఇవ్వకపోతే పాలకులు ప్రజా సంక్షేమాన్ని ఏమి పట్టించుకుంటారని ప్రశ్నించారు. ప్రజల ఓట్లతో గెలిచిన పీఎం మోదీ అదానీ, అంబానీలకు కొమ్ము కాస్తూ పాలన సాగిస్తుండడం సమంజసం కాదన్నారు. నాయకుడు తాండ్ర కనకరాజు మాట్లాడుతూ ఉక్కు కర్మాగారం కోసం ఇళ్లు, భూములను కోల్పోయి ఇప్పటికీ వందలాది మంది నిర్వాసితులుగా ఉన్నారని, వారికి ఇప్పటికీ న్యాయం చేయకపోవడం విచారకరమన్నారు. ఎందరో ప్రాణ త్యాగాలతో ఏర్పడిన స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తే తీవ్ర పరిణామాలను ఎదుర్కొనవలసి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.ప్రసాద్, కె.ఆనంద్, జి.గోపి, వి.ప్రసాద్, పి.సోమునాయుడు, ఎన్.సింహాద్రి, డి.అప్పారావు, మొహిద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు'ను ప్రైవేటీకరించే హక్కు కేంద్రానికి లేదు

అగనంపూడి: ఎన్నో పోరాటాల ఫలితంగా ఏర్పాటైన స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించే హక్కు కేంద్రానికి లేదని ఉక్కు పరిరక్షణ కమిటీ స్థానిక నాయకులు పేర్కొన్నారు. ఉక్కు ప్రైవేటీకరణను నిరసిస్తూ వేపచెట్టు జంక్షన్ వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పోరాటాలతో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శీరంశెట్టి గోవిందరావు, అట్టా అప్పారావు, మరిడయ్య, అబ్బాయ్, సూర్య సత్యారావు, నీలకంఠం, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యలపై నాయకులు పోరాడాలి

బీఎంఎస్ జాతీయ అధ్యక్షుడు హిరణ్మయి పాండే



బీఎంఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులతో హిరణ్మయి పాండే

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 26: సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల సమస్యలపై సకాలంలో స్పందించడంతో పాటు వాటి పరిష్కారానికి బీఎంఎస్ నాయకులు ముందుండాలని భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) జాతీయ అధ్యక్షుడు హిరణ్మయి పాండే పేర్కొన్నారు. శీలానగర్‌లోని బీవీకే స్కూల్ ప్రాంగణంలో రెండు రోజుల పాటు జరిగిన బీఎంఎస్ నాలుగో రాష్ట్ర మహాసభలు ఆదివారం రాత్రితో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రంగాలలోను ముందుంటున్న మహిళలకు కార్మిక సంఘాలలోనూ తగిన ప్రాధాన్యాన్ని ఇవ్వాలని కోరారు. ఈ సభలో జాతీయ సభ్యురాలు ఆశా మోలే, నాయకులు ఎం.జగదీశ్వరరావు, టి.రఘురామ్, ఎస్.చంద్రశేఖరరావు, ఆర్.సురేశ్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం బీఎంఎస్ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా టి.రఘురామ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కోదండరామ్, ప్రధాన కార్యదర్శిగా ఎంవీ సన్యాసినాయుడు, సహాయ కార్యదర్శిగా లోవరెడ్డి, కోశాధికారిగా లాలం ప్రసాద్, తదితరులు ఎన్నికయ్యారు.

8 నుంచి స్టీల్‌ప్లాంట్‌లో బయోమెట్రిక్ హాజరు అమలు

ఉక్కు టౌన్‌షిప్, ఫిబ్రవరి 26: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, కార్మికులు, కాంట్రాక్టు కార్మికులకు మార్చి ఎనిమిదో తేదీ నుంచి బయోమెట్రిక్ హాజరు విధానాన్ని అమలు చేయనున్నట్టు సోమవారం ఉక్కు యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. బయోమెట్రిక్ మొదటి దశ అమలులో భాగంగా ఈ ఏడాది జనవరిలో కర్మాగారంలోని అన్ని కార్యాలయాల్లో బార్స్‌ను అమలు ప్రారంభించారు. అప్పటికే ఉన్న డైలీ అటెండెన్స్ రికార్డింగ్ సిస్టమ్ (డార్స్)తో పాటు బయోమెట్రిక్ అటెండెన్స్ రికార్డింగ్ సిస్టమ్ (బార్స్)ను ట్రయల్ రన్ నిర్వహించారు. ఫిబ్రవరి ఒకటి నుంచి డార్స్‌ను తొలగించిన ఉక్కు యాజమాన్యం వర్క్స్ సిబ్బందికి కూడా మార్చి ఎనిమిది నుంచి బయోమెట్రిక్ హాజరును అమలు చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన మెషిన్లను ఏర్పాటు చేశారు. అదే రోజు నుంచి కాంట్రాక్టు కార్మికులకు కూడా బయోమెట్రిక్ హాజరును అమలు చేయాలని ఉక్కు యాజమాన్యం సంబంధిత కాంట్రాక్టర్లకు సూచించింది.



సరిపల్లిలో పూర్తయిన సచివాలయ భవనం



అసంపూర్తి పనులతో హెల్త్‌వెల్ నెస్ సెంటర్



ప్రారంభానికి సిద్ధంగా రైతుభరోసా కేంద్రం

భవనాలు పూర్తయినా ప్రారంభించరేం?

- సరిపల్లిలో మూడేళ్ల కిందట సచివాలయం పూర్తి
- తుది దశలో వెల్‌నెస్‌సెంటర్, రైతు భరోసా కేంద్రాలు
- వీటిని అందుబాటు తేవడంలో యంత్రాంగం నిర్లక్ష్యం
- అరకొర వసతుల కార్యాలయాల్లో సిబ్బంది అవస్థలు

పెందుర్తి, ఫిబ్రవరి 26: భవనాలులేక అనేకచోట్ల ప్రభుత్వ కార్యాలయాలు వసతి సమస్య ఎదుర్కొంటుంటే.. కొన్నిచోట్ల నిర్మాణం పూర్తయిన భవనాలను ఉపయోగించుకోలేని దుస్థితి నెలకొంటోంది. ఇందుకు సరిపల్లిలో నెలకొన్న పరిస్థితి అద్దంపడుతుంది. ఇక్కడ సచివాలయ నూతన భవన నిర్మాణం పూర్తయి, మూడేళ్ల వుతున్నా ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు. అలాగే, రైతుభరోసా కేంద్రం, వెల్‌బీబీ సెంటర్ భవన నిర్మాణాలు దాదాపు పూర్తికావచ్చి ప్రారంభానికి ఎదురుచూస్తున్నాయి. గ్రామంలో ఎన్ఆర్‌జీఎస్ నిధులు సుమారు రూ 40 లక్షలతో గ్రామ సచివాలయం నిర్మించారు. 2020లో ప్రారంభించిన ఈ పనులు 2021 నాటికి రెండు శ్లాబులు వేసి అన్ని వసతులతో కార్పొరేట్ కార్యాలయస్థాయిలో భవనాన్ని సిద్ధంచేశారు. కాంట్రాక్టర్‌కు పూర్తిస్థాయిలో బిల్లులు చెల్లించారు. కానీ, మూడేళ్లుగా ఈ భవనం వృథాగా శిథిల స్థితికి చేరుకుంటుంది. ఈ భవనం ప్రారంభం కాకపోవడంతో గ్రామంలో ఉన్న కల్యాణ మండపంలో సిబ్బంది సచివాలయ సేవలందజేస్తున్నారు. ఇక్కడ సరైన వసతులు, ఫర్నీచర్ లేక సిబ్బందికి ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. మరో వైపు సచివాలయం నిర్వహణతో కల్యాణమండపంలో వివాహాలకు అసౌకర్యమవుతుండడంతోపాటు పంచాయతీ ఆదాయం కోల్పోతోంది. అలాగే, గ్రామ సచివాయం సమీపంలోనే రూ.21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రం నిర్మాణానికి రెండేళ్ల క్రితం శ్రీకారం చుట్టారు. భవనం నిర్మాణం పూర్తయింది. విద్యుత్, ఫర్నిచర్ పెయింటింగ్ తదితర చిన్నపాటి పనులు మిగిలివున్నాయి, వీటిని పూర్తి చేసి అందుబాటు లో తేవడంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నట్టు ఆరోపణలున్నాయి. ఈక్రమంలో స్థానిక గోపాలమిత్ర కేంద్రాన్ని రైతు భరోసా కేంద్రంగా మార్పు చేసి వినియోగిస్తున్నారు. దీంతో రైతులకు ఇబ్బందులు తప్పడంలేదన్న విమర్శలున్నాయి,

సామాజిక భవనంలో హెల్త్ సెంటర్..

సరిపల్లిలో రూ 20.80 లక్షలతోఏడాది క్రితం ప్రారంభించిన హెల్త్‌వెల్ నెస్ సెంటర్ పనులుపూర్తికావచ్చినా, కొద్దిపాటి నిధుల కొరత పనులు నిలిచిపోయాయి ఇంకా శానిటరీ, విద్యుత్, పెయింటింగ్ పనులు మిగిలివున్నాయి.గ్రామంలో ఇరుకు సామాజిక భవనంలో ప్రస్తుతంవైద్యసిబ్బంది ఆరోగ్య సేవలందిస్తున్నారు.స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ చొరవ తీసుకుని ఈభవనాలను అందుబాటులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

సచివాలయం ప్రారంభానికి చర్యలు

సరిపల్లిలో రైతు భరోసా కేంద్రం, హెల్త్ వెల్‌నెస్ సెంటర్ పూర్తికి చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం మండల పరిషత్, జెడ్పీటీసీ నిధులు సమీకరణ చేస్తున్నాం. ఈరెండు భవనాలు పూర్తికి మరో రూ.6లక్షలు అవసరం. సచివాలయ భవనం త్వరలోనే ప్రారంభిస్తాం.

- మూర్తి, డీఈ పంచాయతీరాజ్, పెందుర్తి

వెంకటేశ్వర స్వామికి పూజలు



పూజల్లో సీఐ రామకృష్ణ, తదితరులు

పెందుర్తి, ఫిబ్రవరి 26: స్థానిక వెంకటాద్రి శిఖరంపై కొలువైయున్న వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని సోమవారం పెందుర్తి సీఐ ఎల్ రామకృష్ణ సందర్శించారు. వివాహ వార్షికోత్సవం సందర్భంగా సీఐ దంపతులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ సంప్రదాయం ప్రకారం సీఐని అర్చకులు సత్కరించారు.

శారదా పీఠాన్ని సందర్శించిన వైవీ సుబ్బారెడ్డి

పెందుర్తి, ఫిబ్రవరి 26: రాజ్యసభసభ్యుడిగా ఎంపికైన వైవీ సుబ్బారెడ్డి సోమవారం చినముషిడివాడలోని శారదాపీఠాన్ని సందర్శించారు. ఈసందర్భంగా పీఠం అధిష్టాన దేవత శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారికి పూజలు నిర్వహించారు. ప్రాంగణంలో గల దేవతామూర్తులను దర్శించుకున్నారు. అనంతరం పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతినుంచి ఆశీస్సులు తీసుకున్నారు.

నేడు విద్యుత్ ఉండనిప్రాంతాలు..

వేపగుంట ఫిబ్రవరి 26: నాయుడుతోట బంటాకాలనీ 11 కేవీ ఫీడర్‌లో నిర్వహణ పనుల్లో భాగంగా మంగళవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలివేయనున్నట్లు వేపగుంట ఏఈ డి.వి.రమణమూర్తి తెలిపారు. నాయుడుతోట రవినగర్, అప్పలనర్సయ్య కాలనీ, బంటాకాల ప్రాంతప్రజలు గమనించాలని పేర్కొన్నారు.

ఓటర్ల నమోదులో బాధ్యతగా వ్యవహరించాలి

» బీఎల్‌వోల సమావేశంలో పెందుర్తి నియోజకవర్గ ఈఆర్‌ఓ శేషశైలజ



మాట్లాడుతున్న పెందుర్తి ఈఆర్‌ఓ శేషశైలజ

వేపగుంట ఫిబ్రవరి 26: ఓటర్ జాబితాల్లో మార్పులు, చేర్పులు, కొత్త నమోదులు విషయంలో బీఎల్‌ఓలు బాధ్యతగా వ్యవహరించాలని పెందుర్తి నియోజకవర్గ ఈఆర్‌ఓ శేషశైలజ పేర్కొన్నారు. వేపగుంట సామాజిక భవనంలో సోమవారం సాయంత్రం నియోజకవర్గ పరిధిలోని బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటరు జాబితాలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి లోపాలను సేకరించాలన్నారు. ఫారమ్‌లో ఇచ్చిన సమాచారం తప్పుగా ఉంటే సంబంధిత వ్యక్తులపై ఎలక్షన్ కమిషన్ చర్యలు చేపడుతుందన్నారు. అందువల్ల ప్రతీ ఉద్యోగి ఓటర్‌నమోదులో జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి, సబ్బవరం, పరవాడ తహసీల్దార్లు వెంకటరావు, చలమయ్య, గణపతి తదితరులు పాల్గొన్నారు.



తారస్ వాహనానికి పూజ చేస్తున్న నరేశ్‌కుమార్

చెత్త తరలింపు వాహనం ప్రారంభం

గాజువాక, ఫిబ్రవరి 26: గాజువాక జోన్ పరిధిలో చెత్త తరలింపునకు ఉపకరించే భారీ తారస్ వాహనాన్ని, ఎక్స్‌కవేటర్‌ను, సెప్టిక్ క్లీనింగ్‌కు వినియోగించే పలు కొత్త వాహనాలను సోమవారం జీవీఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ నరేశ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8.5 టన్నుల కెపాసిటీ కలిగిన భారీ తారస్ వాహనం ద్వారా ఇక్కడి డంపింగ్ యార్డులో నిల్వ చేసిన చెత్తను ఏ రోజు కారోజు నగరంలోని ప్రధాన డంపింగ్ యార్డుకు తరలించడం జరుగుతుందన్నారు. జోన్ పరిధిలోని ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు అందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంవోహెచ్ కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'స్పందన'లో 22 వినతులు స్వీకరణ

గాజువాక, ఫిబ్రవరి 12: జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వివిధ సమస్యలకు సంబంధించి ప్రజలు 22 వినతులను సన్యాసినాయుడుకు అందజేశారు. వీటిలో ప్రధానంగా తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆరు, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని ఎనిమిది, డ్రైనేజీలు నిర్మించాలని మూడు, రోడ్లకు మరమత్తులు చేపట్టాలని ఐదు, తదితర సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు అర్జీలు అందించారు.

ఘనంగా బల్లల పండుగ



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, తదితరులు

అగనంపూడి, ఫిబ్రవరి 26: జీవీఎంసీ 85వ వార్డు పరిధి కొండయ్యవలస దోబీ ఘాట్ వద్ద సోమవారం బొబ్రమాంబ రజక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బల్లల పండుగను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాటాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే రజికులను ఎస్సీల్లో చేర్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, తోకాడ రాము, బలిరెడ్డి శ్రీను, బి.అప్పారావు, బి.చందూ రమేశ్, సత్యనారాయణ, ఈశ్వరమ్మ, లీల, లక్ష్మిపాల్గొన్నారు.

ఎన్నికల్లో చేనేతలు పోటీ చేసేందుకు టికెట్లు కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పప్పు రాజారావు

ఆటోనగర్, ఫిబ్రవరి 26: త్వరలో జరగనున్న అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో చేనేతలకు రాజకీయ పార్టీలు టికెట్లు కేటాయించి, పోటీ చేందుకు అవకాశం కల్పించాలని ఏపీ చేనేత కులాల ప్రధాన కార్యదర్శి పప్పు రాజారావు డిమాండ్ చేశారు. సోమవారం శ్రీనగర్‌లో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 16 శాతం చేనేత కులాల వారున్నారని, టీడీపీ-జనసేన ప్రకటించిన తొలి జాబితాలో ఒక సీటును కూడా చేనేతలకు కేటాయించకపోవడం అన్యాయమన్నారు. నాయకులు తేజ, సత్యనారాయణ, శంకరరావు ఉన్నారు.

సినిమా గైడ్

- **భ్రమయుగం :** జగదాంబ, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **సుందరం మాస్టర్ :** శారద, శరత్, సౌజన్య (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), లక్ష్మి (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ముఖ్య గమనిక :** వెంకటేశ్వర
- **సిద్దార్థ్ రాయ్ :** శ్రీరామ, శ్రీకన్య, శ్రీలీలామహల్, మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **ఊరు పేరు భైరవకోన :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి, నరసింహ (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ఈగల్ :** రమాదేవి, మోహిని (గాజువాక)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 28, టమాటా 18, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (నలుపు) 24, బెండకాయలు 34, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 48, బీరకాయలు 40, ఆనపకాయలు 20, కాలీఫ్లవర్ 26, క్యాబేజ్ 24, క్యారెట్ 22, దొండకాయలు 32, బంగాళదుంపలు 17, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 65, అల్లం (పాతది) 110, బరబాటి 26, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 40, దోసకాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 52, ఆగాకర 52, పొటల్స్ 62, కీరదోస 32, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 48, చిలగడదుంపలు 28 , కంద 60, దేముడు చిక్కుడు 58, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 60, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు

బ్యాగ్		
రైతు ధర	--	125
ఫారం ధర	--	145
విత్ స్కిన్	--	260
స్కిన్‌లెస్	--	270

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..



శానిటరీ సెక్రటరీల సమావేశంలో మాట్లాడుతున్న కిరణ్‌కుమార్

పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలి

గాజువాక జోనల్ ఏఎంవోహెచ్ కిరణ్‌కుమార్

గాజువాక, ఫిబ్రవరి 26: పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దడంలో శానిటరీ సెక్రటరీలు కీలక పాత్ర పోషించాలని జీవీఎంసీ గాజువాక జోనల్ ఏఎంవోహెచ్ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. జోనల్ కార్యాలయంలో సోమవారం జరిగిన శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ శానిటరీ సెక్రటరీల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని వార్డుల్లోని వీధులు, కాలనీల్లో చెత్తాచెదారం పేరుకుపోకుండా పటిష్ట చర్యలు చేపట్టి ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్నారు. సేకరించిన చెత్తను ఎప్పటికప్పుడు డంపింగ్ యార్డ్‌కు తరలించాలన్నారు. ప్రస్తుతం వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల కారణంగా అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, అందువల్లో వీధుల్లో చెత్తాచెదారాన్ని తొలగించడం వల్ల ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని కిరణ్‌కుమార్ పేర్కొన్నారు.

ఉక్కు కార్మికుల పాదయాత్ర వాయిదా

ఉక్కుటౌన్ షిప్: ఫిబ్రవరి 26: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ మంగళవారం తలపెట్టిన పాదయాత్రను వేయినట్టు ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కన్వీనర్ కేఎస్ఎన్ రావు తెలిపారు. కూర్మన్నపాలెం నుంచి జీవీఎంసీ ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహం వరకు పాదయాత్ర చేసేందుకు పోరాట కమిటీ నిర్ణయం తీసుకుందని, అయితే ప్రధాన మంత్రి విశాఖ పర్యటన వాయిదా పడడంతో పాదయాత్రను వాయిదా వేశామన్నారు. మార్చి మూడో తేదీన పాదయాత్ర చేపట్టి పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన పేర్కొన్నారు.

ఒత్తిడి లేకుండా పరీక్షలు రాస్తే మంచి ఫలితాలు

శిష్టకరణ యువత రాష్ట్ర అధ్యక్షుడు ఎం.సురేశ్‌కుమార్



విద్యార్థులకు ఎగ్జామ్ కిట్లను అందజేస్తున్న సురేశ్‌కుమార్, తదితరులు

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 26: ఒత్తిడి లేకుండా విద్యార్థులు పరీక్షలు రాస్తే మంచి ఫలితాలను సాధించవచ్చని శిష్టకరణ యువత రాష్ట్ర అధ్యక్షుడు ఎం.సురేశ్‌కుమార్ అన్నారు. కూర్మన్నపాలెం శిష్టకరణ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం టెన్త్, ఇంటర్ పరీక్షలు రాయనున్న విద్యార్థులకు ఎగ్జామ్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా శ్రమించి ఇష్టంతో చదవాలని, పరీక్షలు బాగా రాసి మంచి భవిష్యత్తును పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు గంగవరం గోపి, డి.సత్యారావు, రవికాంత్, నరసింహరావు, తదితరులు పాల్గొన్నారు.

71వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మేయర్ హరివెంకటకుమారి, ఎమ్మెల్యే నాగిరెడ్డి

ఆటోనగర్, ఫిబ్రవరి 26: జీవీఎంసీ 71వ వార్డు పరిధి ఎల్‌వీనగర్ నుంచి తోకాడ పార్కు రహదారిలో సీసీ డ్రైనేజీల నిర్మాణానికి, తోకాడ శ్మశానవాటిక నుంచి ఎల్‌వీ నగర్ డ్రైనేజీని, కుంచుమాంబ కాలనీ నుంచి దుర్గాదేవి ఆలయం వరకు, కుంచుమాంబ కాలనీలో కల్వర్టుల నిర్మాణ పనులకు సోమవారం మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వార్డులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే వైసీపీ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రామారావు, చందు, స్థానిక నాయకులు బి.గోవింద్, డి.కృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు. అలాగే వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా కణితి కాళింగుల వీధిలో నూతన బోరింగ్ ఏర్పాటు పనులకు నాగిరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ప్రగడ వేణుబాబు, బి.గోవింద్, ఎం.దామోదర్, బి.గోవింద రాజులు, డి.దానప్పలు, శ్రీను, శంకరరావు, సన్యాసినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో కార్మికులకు అన్యాయం



నిరసన చేపడుతున్న సీపీఐ నాయకులు

మల్కాపురం, ఫిబ్రవరి 26 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలతో వేలాది కుటుంబాలకు అన్యాయంచేస్తున్నాయని సీపీఐ పశ్చిమ నియోజకవర్గ నేత కాండ్రేగుల సత్యంజనేయ పేర్కొన్నారు. స్థానిక కాకరలోవ ప్రాంతంలో సీపీఐ ఆధ్వర్యంలో ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా సోమవారం నిరసన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అన్ని విధాల నాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారన్నారు. అనంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు గుడాల రాంబాబు, కె.శ్రీనివాస్, కామేశ్వరరావు, ఐ. కనకేశ్వరరావు, జి. రామకృష్ణ, కె.దేవుడు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

2వ తేదీన టిడ్కో ఇళ్లు ప్రారంభం



ఆడారి ఆనందకుమార్‌కు వెంకటేశ్వర స్వామి ఫొటో అందజేస్తున్న లబ్ధిదారులు

ఎన్.ఎ.డి. జంక్షన్ ఫిబ్రవరి 26: టిడ్కో ఇళ్లను మార్చి 2వతేదీన ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని వైసీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయ కర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. సోమవారం మర్రిపాలెం ఉడా కాలనీలో ఉన్న పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజవకర్గ పరిధిలో రూ. 100 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ములగాడ, పద్మనాభనగర్‌లో టిడ్కో ఇళ్ల ప్రారంభోత్సవం, శంకుస్థాన కార్యక్రమాలను వచ్చేనెల 2వతేదీన చేపట్టాలని సూచించారు. ఇప్పటికే ఆయా కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీలు దాదాపు 95శాతం పూర్తయ్యాయన్నారు. లబ్ధిదారులు తమ కుటుంబ సభ్యులు, బంధువులను కూడా ఆహ్వానించి పండుగలా ఈ కార్యక్రమం చేపట్టాలన్నారు. ముందుగా లబ్ధిదారులు ఆనందకుమార్ వెంకటేశ్వరస్వామి ఫొటోను బహుమతిగా అందజేశారు. కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, వైసీపీ నాయకులు గునిశెట్టి శ్రీనివాస్, ఆళ్ల పైడిరాజు, 60వార్డు కార్పొరేటర్ పి.వి.సురేశ్ తదితరులు పాల్గొన్నారు.


నరసింహనగర్‌లో రోడ్డుపై ఏర్పాటు చేసిన బడ్డీలు


రహదారిపై టీ, పండ్ల దుకాణాలు

రహదారులపై దుకాణాలు

» నరసింహనగర్ మార్గంలో బడ్డీల ఏర్పాటు
» రాకపోకలకు తీవ్ర అవస్థలు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 26 : గ్రేటర్ 14, 45వ వార్డుల పరిధి నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని ఉన్న నరసింహనగర్ రహదారిని ఆక్రమించి బడ్డీలు వెలిశాయి. దీంతో రాకపోకలకు వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. గతంలో ఈ రోడ్డుపై చేపలు విక్రయించే వ్యాపారుల మాత్రమే ఉండేవారు. ప్రస్తుతం రోజురోజుకు ఇనుపబడ్డీలు తయారు చేయించి అక్కడ పెట్టి వివిధ వ్యాపారాలు సాగిస్తున్నారు. అలాగే, ఈ దుకాణాల వద్దకు వచ్చిన వినియోగదారులు రోడ్డుపైనే పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్‌కు ఆటంకం కలుగుతోందని పలువురు పాదచారులు, వాహనచోదకులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ మార్గంలో రెండు కళాశాలలున్నాయి. ఇవి విడిచిపెట్టిన సమయంలో విద్యార్థులు లోనించి నుంచి బయటకు రావడానికి అవస్థలు పడుతున్నారు. అంతేకాకుండా అక్కయ్యపాలెం నాలుగు లేన్ల రహదారి బస్టాప్ వెనుక ఉన్న ఖాళీ స్థలంలో లక్షలాది రూపాయల వ్యయంతో పార్కు, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. దానికి ఎదురుగా కూడా బడ్డీలు ఏర్పాటు చేశారు. దీంతో పాటు అక్కడే ఇసుక వేసి ఆటోల ద్వారా విక్రయిస్తున్నారు. ఇంతగా ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నా జీవీఎంసీ అధికారులు పట్టించుకోకపోవడం ఎంతవరకు సమంజసమని పరిసర ప్రాంతాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రహదారిపై ఏర్పాటు చేసిన బడ్డీలపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

అంతర్ కళాశాలల క్రికెట్ విజేత ఏఎంసీ


జట్టు సభ్యులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు తదితరులు

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఫిబ్రవరి 26: వైఎస్సార్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ అంతర్ వైద్య కళాశాలల క్రికెట్ టోర్నీలో ఆంధ్ర మెడికల్ కాలేజీ (ఏఎంసీ) చాంపియన్‌గా నిలిచింది. రాజమండ్రిలో జరిన ఈ టోర్నీ ఫైనల్స్‌లో ఆంధ్ర మెడికల్ కాలేజీ పది పరుగుల తేడాతో ఆతిథ్య జీఎస్ఎల్ జట్టుపై విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఏఎంసీ నిర్ణీత 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లకు 119 పరుగుల చేయగా, లక్ష్య ఛేదనలో జీఎస్ఎల్ నిర్ణీత 20 ఓవర్లలో ఎనిమిది వికెట్లకు 108 పరుగులు చేసి ఓటమి చెందింది. సోమవారం ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు తన కార్యాలయంలో టీం కెప్టెన్ కేవీ అభిషేక్‌తోపాటు జట్టు సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ స్పోర్ట్సు వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్.సునీల్‌కుమార్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎంఎస్ఎస్.పాత్రుడు పాల్గొని క్రీడాకారులను అభినందించారు. మరిన్ని విజయాలు సొంతం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

ఫ్లూ పరేషాన్

... 5వ పేజీ తరువాయి

తీసుకోవాలని ఆయన సూచించారు.

అనవసరమైన మందులు వాడొద్దు..ఐదు రోజుల్లో నయం

\- డాక్టర్ సోమయాజులు, జనరల్ ఫిజీషియన్

ఫ్లూ వైరస్ కారణంగా జ్వరాలు ఎక్కువ కనిపిస్తున్నాయి. గడచిన పది రోజుల రెండు రెట్లు అధికంగా కేసులు నమోదవుతున్నాయి. జ్వరం, దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలు ఉంటున్నాయి. ఐదు రోజుల్లో జ్వరం తగ్గుముఖం పడుతుంది. పారాసిటమాల్ వేసుకుంటే సరిపోతోంది. ఐదు రోజులకు మించి లక్షణాలు ఉంటే మాత్రం వైద్యుల సలహాతో పరీక్షలు చేయించుకోవాలి. ఫ్లూయిడ్స్ గానీ, ఇతర మందులు గానీ వైద్యులు సూచనకు అనుగుణంగా వినియోగించడం మంచిది. వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఎక్కువ నీళ్ల తాగడం మేలు. రానున్న రోజుల్లో రకరకాల వైరస్‌లు మరింత యాక్టివ్ అయి వ్యాధుల వ్యాప్తికి కారణమవుతాయి. తగిన జాగ్రత్తలు తీసుకోవడం ఉత్తమం.

వైసీపీ నేతల గుప్పిట్లో ఫిల్మ్‌నగర్ క్లబ్!

... 5వ పేజీ తరువాయి

దరకు భూమిని ఇప్పించకుండా మొత్తం సొమ్ము వెచ్చించి భూమి కొనడం ఏమిటని ప్రశ్నించారు. దాంతో కమిటీ పెద్దలు తాత్కాలికంగా ఒక అడుగు వెనక్కి తగ్గినా...ఇప్పుడు మరో రెండేళ్ల అధికారం చేతికి రావడంతో భీమిలిలో భూమి కొనుగోలుకు ప్రయత్నించే అవకాశం ఉందని సభ్యులు ఆరోపిస్తున్నారు. కొనాలనుకుంటున్న భూమికి సంబంధించి వివాదాలు ఉన్నాయని, సరైన మార్గం కూడా లేదని అంటురు. ముందు రూ.10 కోట్లు అడ్వాన్స్ ఇచ్చి, పొజిషన్ తీసుకున్నాక తీరుబడిగా మిగిలిన మొత్తం చెల్లించవచ్చునని కమిటీ పెద్దలు చెబుతున్నారు. కానీ, పూర్తి మొత్తం తీసుకోకుండా ఏడు ఎకరాల భూమి ఎలా అప్పగిస్తారని కొందరు సందేహం వ్యక్తంచేస్తున్నారు. అయితే సభ్యులు ఏమి మాట్లాడినా అధికార పార్టీ టార్గెట్ చేస్తుందనే భయంతో ఎవరూ నోరు విప్పడం లేదు. కొత్త కార్యవర్గం విశాఖను ఫిల్మ్ మేకింగ్, స్టూడియోలకు హబ్‌గా మార్చేందుకు కృషిచేస్తామని ప్రకటించింది. అయితే సినిమా రంగానికి చెందిన వారెవరికీ ఇందులో కీలక స్థానం కల్పించలేదు. అధికార పార్టీ నాయకులకు అనుయాయులుగా సమాజంలో ముద్ర పడిన వారే పీఠం దక్కించుకున్నారు. వీరు సినిమా రంగాన్ని ఎలా అభివృద్ధి చేస్తారని, ఈ రెండేళ్ల ఏమి చేశారని సభ్యులు ప్రశ్నిస్తున్నారు. రాజకీయాలకు అతీతంగా ఉండే పరిశ్రమను సైతం కలుషితం చేశారని కొందరు వాపోతున్నారు. నగరంలో కొందరు ప్రముఖులు చిత్ర పరిశ్రమతో సంబంధం ఉన్నవారు రెండేళ్ల క్రితమే సభ్యత్వం కోసం డబ్బులు చెల్లిస్తే వారికి ఇప్పటికి కూడా కార్డులు ఇవ్వలేదు. వారికి ఎన్నికల్లో భాగస్వామ్యం కల్పించలేదు. ఈ క్లబ్‌లో ఏదీ నిబంధనల ప్రకారం జరగడం లేదని, ఇది కమిటీ క్లబ్బే తప్ప సభ్యులది కాదని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. కమిటీకి అనుకూలంగా బైలాను మార్పు చేసుకున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

స్విమ్మింగ్‌లో గ్రీష్మిణికి పతకాల పంట


పతకాలతో గ్రీష్మిణి

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఫిబ్రవరి 26: ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ టోర్నీలో నగరానికి చెందిన వి. నాగ గ్రీష్మిణి రెండు స్వర్ణ, రెండు కాంస్య పతకాలు సాధించారు. గుహవటిలో జరిగిన ఈ టోర్నీలో గ్రీష్మిణి అద్భుతమైన ప్రతిభ ప్రదర్శించి 50మీ. బ్రెస్ట్ స్ట్రోక్, 100మీ. బ్రెస్ట్ స్ట్రోక్‌లలో స్వర్ణ పతకాలు కైవసం చేసుకోగా 4×200 (ప్లస్ గుర్తును ఇంటుగా మార్చగలరు) ఫ్రీ స్టైల్ రిలే, 4×100 మెడ్లీ రిలే ఈవెంట్లలో కాంస్య పతకాలు సాధించారు. ఈసందర్భంగా స్విమ్మింగ్ సంఘం కార్యదర్శి మోహన్ వెంకట్‌రామ్, కోచ్ నాయుడు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

'దక్షిణ' టికెట్ కేటాయించరూ..

»టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్


చంద్రబాబుకు పుష్పగుచ్ఛమిస్తున్న నజీర్

మహారాణిపేట, ఫిబ్రవరి 26: శాసన సభ్యునిగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడును కోరారు. సోమవారం ఉండవల్లిలో చంద్రబాబును ఆయన మర్యాపూర్వకంగా కలసి ఈ మేరకు విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా విశాఖలోని రాజకీయ పరిస్థితులను వివరించారు. గత 30 సం వత్సరాలుగా పార్టీని నమ్ముకుని సేవలు అందిస్తున్నానని, ముస్లిం మైనారిటీ కోటాలో దక్షిణ నియోజకంలో శాసన సభ్యునిగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని నజీర్ కోరారు.

ఉత్తర టీడీపీ ఇన్‌చార్జిగా నియమించాలి: అకిరెడ్డి

అక్కయ్యపాలెం: ఉత్తర నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్‌గా తనను నియమించాలని విశాఖ పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రటరీ, 42వ వార్డు సీనియర్ నాయకుడు అకిరెడ్డి జగదీష్ కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం విశాఖ పార్లమెంటరీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌కు దరఖాస్తు అందజేశారు. కొద్దిరోజుల క్రితం మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావుకు కూడా దరఖాస్తు అందజేసినట్లు చెప్పారు. పల్లా శ్రీనివాస్‌ను కలిసి దరఖాస్తు అందజేసిన వారిలో వార్డు టీడీపీ ప్రధాన కార్యదర్శి ముక్కి రామకృష్ణ, నాయకులు ఎం.శ్రీకృష్ణ, ఎంఎల్ఎన్ రావు ఉన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సీతమ్మధార, ఫిబ్రవరి 26: విద్యుత్ హెచ్చు తగ్గులు తగ్గించే నిమిత్తం నక్కవానిపాలెం ఫీడర్ పరిధి చేపడుతున్న పనుల నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ జోన్ 1 ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. నక్కవానిపాలెం, సత్యం కూడలి, జీవీఎంసీ ప్రైమరీ స్కూల్ ప్రాంతం, రిసోనాన్స్ స్టడీ సెంటర్, శారద స్కూల్ ప్రాంతం, శివాలయం వీధి, వివేకానంద కళ్యాణ మండపం ప్రాంతంలోని వినియోగదారులు సహకరించాలని కోరారు.

బుద్ధుని బోధనలతో సమాజ మార్పు

» బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రతినిధులు


ఎన్నికైన నూతన కమిటీ ప్రతినిధులు

సీతంపేట, ఫిబ్రవరి 26: బుద్ధుని సిద్ధాంతాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి సమాజంలో మార్పు తీసుకురానున్నామని బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రతినిధులు తెలిపారు. రామాటాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో నిర్వహిస్తున్న 11వ బౌద్ధ మహాసమ్మేళనంలో భాగంగా రెండో రోజైన సోమవారం జాతీయ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించి నూతన కేంద్ర కమిటీని ట్రస్టీ ప్రతినిధులను ఎన్నుకున్నారు. ట్రస్టీ జాతీయ అధ్యక్షుడిగా చంద్ర బోధి పాటిల్, ట్రస్టీ ప్రధాన కార్యదర్శిగా బీకే బరేవ్, కోశాధికారిగా శంకరరావు దొంగేరెలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన నూతన కమిటీ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కలలు గన్న ప్రబుద్ధ భారత్ నిర్మాణానికి కృషి చేస్తామనిఈ సందర్భంగా పేర్కొన్నారు. బుద్ధిని జీవితం, బోధనలు నేటి తరానికి ఆదర్శనీయమన్నారు. ఆయన బాటలో పయనిస్తే సమాజ పురోభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.

ఔషధ మొక్కల పెంపకంతో లాభాలు


మాట్లాడుతున్న డా. బృందావనం

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 26: అటవీ ఔషధ మొక్కల పెంపకం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని బయోడైవర్సిటీ ఎక్స్‌పర్ట్ డాక్టర్ ఎన్.బి.బృందావనం అన్నారు. అటవీ ఔషధ మొక్కల సేకరణ పద్ధతులపై క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా , ఆంధ్రప్రదేశ్ ఔషధ , సుగంధ మొక్కల బోర్డు ఆధ్వర్యంలో ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని డాబాగార్డెన్స్‌లోని ఓ హాల్‌లో సోమవారం నిర్వహించారు. గిరిజన ఔత్సాహికులు పాడేరు, సీతంపేట, అరకు, పార్వతీపురంమాన్యం, విజయనగరం తదితర ప్రాంతాల నుంచి పాల్గొన్నారు. బృందావనం ముఖ్య అతిథిగా హాజరై అటవీ ఉత్పత్తుల సేకరణపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా న్యూఢిల్లీ ఎం.జంగయ్య, ఎం.విజయకుమార్, సీహెచ్ దుర్గాప్రసాద్, జి.కృష్ణశ్రీ, ఎం.ప్రణీత, కల్యాణి, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినిపై పీఈటీ అఘాయిత్యం

» నిందితుడి అరెస్టు, రిమాండ్‌కు తరలింపు
» పోక్సో చట్టం కింద కేసు నమోదు

విశాఖపట్నం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): విశాఖలో మరో దారుణం వెలుగుచూసింది. కార్పొరేట్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థినిపై అదే పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు (పీఈటీ)గా పనిచేస్తున్న వ్యక్తి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. బాలిక గర్భం దాల్చడంతో కీచక ఉపాధ్యాయుడి బాగోతం బయటపడింది. దీనికి సంబంధించి పీఎం పాలెం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మధురవాడ ప్రాంతంలోని ఒక కార్పొరేట్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న బాలికను పీఈటీ మాయమాటలు చెప్పి లొంగదీసుకున్నాడు. సెలవు రోజుల్లో ప్రత్యేక శిక్షణ తరగతులు ఉన్నాయంటూ బాలికను పాఠశాలకు పిలిపించి అఘాయిత్యానికి పాల్పడేవాడు. ఈ క్రమంలో బాలికకు రెండు రోజుల కిందట కడుపునొప్పి రావడంతో తల్లిదండ్రులు సమీపంలోని ఆస్పత్రికి తీసుకువెళ్లారు. బాలికను పరీక్షించిన వైద్యులు...గర్భవతిగా నిర్ధారించడంతో పోలీసులకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా రిమాండ్‌కు ఇచ్చినట్టు పోలీసులు తెలిపారు. అతనిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

'అత్యాచార కేసులో నిందితుడైన డ్రిల్‌మాస్టర్‌ను శిక్షించాలి'

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 26: విద్యార్థినిపై అత్యాచారం చేసిన మధురవాడలోని ఓ కార్పొరేట్ పాఠశాల పీఈటీపై కఠినంగా శిక్షించి, ఆ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని మహిళా చేతన ప్రధాన కార్యదర్శి కె.పద్మ డిమాండ్ చేశారు. సోమవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నిందితుడిపై ఇప్పటికే పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదైందన్నారు. అత్యాచార నిరోధక చట్టం 376కు వచ్చిన సవరణ, సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్‌ను అనుసరించి పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈవిషయంపై కలెక్టర్ పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో వీకేఎస్ కార్యదర్శి అన్నపూర్ణ, ఎ.సత్యవతి, కె.లావణ్య తదితరులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యంతో జీవితంలో రాణింపు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 26: ప్రతి విద్యార్థీ ఏదైనా వృత్తిలో నైపుణ్యం పెంపొందించుకుని జీవితంలో రాణించాలని విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.శోభారాణి తెలిపారు. కళాశాలలో స్కిల్‌హబ్‌లో అసోసియేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులను రెండు బ్యాచ్‌లను మూడు నెలల కాల వ్యవధిలో పూర్తి చేసిన విద్యార్థినులకు సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. విద్యారులు చదువుతోపాటు ఇతర వృత్తులను నేర్చుకుంటే భవిష్యత్తులో స్వయం ఉపాధికి వీలుంటుందన్నారు. ఈ క్రమంలో విద్యా విధానంలో మార్పులు చేసుకుంటున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి, బి.హైమావతి, కె.ప్రశాంతి, బి.సునీల్, ఎస్.కనమహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీబీఆర్ఎన్ మెడికల్ మేనేజ్‌మెంట్ సెంటర్ ఏర్పాటు ఎన్నడో?

... 5వ పేజీ తరువాయి

పేలుడు, కొవిడ్ వంటి వైరస్‌లు వ్యాప్తి చెందినప్పుడు బయోలాజికల్ విభాగానికి చెందిన బృందం, పరిశ్రమల్లో రేడియేషన్‌కు సంబంధించిన పదార్థాల పేలుడు జరిగినప్పుడు రేడియోలాజికల్ విభాగం సిబ్బంది సేవలు అందిస్తారు. ఇందుకుగాను విమ్స్ వైద్యులకు నాలుగు నెలల కిందట తమిళనాడులో అడ్వాన్స్‌డ్ శిక్షణను అందించారు. ఈ సెంటర్ ఏర్పాటులో భాగంగా విమ్స్‌లో ప్రత్యేకంగా న్యూక్లియర్ బ్లాక్‌ను ఏర్పాటుచేయనున్నారు. కానీ, ఆశించిన స్థాయిలో పనులు ప్రారంభం కాకపోవడంతో ఈ సెంటర్ ఏర్పాటుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 26: వడ్డాదిలో విద్యుదాఘాతానికి గురై ఓ బాలుడు మృతి చెందాడు. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. రాజస్థాన్‌కి చెందిన జాలంసింగ్, అతని సోదరుడు చందనసింగ్ రాథోడ్ వడ్డాదిలో హార్డ్‌వేర్, ప్లంబింగ్ వ్యాపారం చేస్తున్నారు. జాలంసింగ్‌కి ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు యువరాజ్‌సింగ్ రాథోడ్(10) ఓ ప్రైవేటు స్కూల్‌లో ఐదవ తరగతి చదువుతున్నాడు. పెద్ద కుమారుడికి ఎఫ్ఏ-4 పరీక్షలు జరుగుతుండడంతో ఆ బాలుడిని జాలంసింగ్ తన సోదరుడి ఇంటి వద్ద వదిలి బంధువుల వివాహానికి భార్య చిన్న కుమారుడితో రాజస్థాన్ వెళ్లాడు. సోమవారం సాయంత్రం బాబాయి ఇంటి మేడపై ఆడుకుంటున్న యువరాజ్ సింగ్ ఇంటికి సమీపంలో ఉన్న విజయరామరాజుపేట ఫీడర్ 11 కేవీ లైన్ వైర్లును పట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురై పెద్దగా కేకలు పెట్టాడు. కేకలు విన్న బాబాయ్ చందన సింగ్ రాథోడ్ కర్రతో యువరాజ్‌సింగ్ రాథోడ్‌ని కొట్టి వైర్లు నుంచి తప్పించాడు. చికిత్స కోసం తరలిస్తుండగా మార్గమధ్యంలో ఆ బాలుడు మృతి చెందాడు.

లారీని ఢీకొన్న వ్యాన్.. నలుగురికి తీవ్ర గాయాలు

కశింకోట, ఫిబ్రవరి 26: జాతీయ రహదారిపై మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్ఐ రమేశ్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం దిబ్బిలివీధికి చెందిన ఆరుగురు వ్యక్తులు అన్నవరం పుణ్య క్షేత్రానికి టాటా ఏస్ వ్యాన్‌లో వెళ తున్నారు. కశింకోట వచ్చే సరికి ముందు వెళుతున్న లారీ డ్రైవర్ ఆకస్మికంగా బ్రేకులు వేశాడు. దీంతో లారీ వెనుక భాగాన్ని వ్యాన్ ముందు భాగం ఢీకొన్నది. ఈ ప్రమాదంలో అమనాన చక్రపాణి, అమనాన భాగ్యరేఖ, సకలబత్తుల పావని, అలుపాని శ్రీనివాస రావు(డ్రైవర్) తీవ్రంగా గాయపడ్డారు. హైవే పెట్రోలింగ్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని 108 అంబులెన్స్‌లో క్షతగాత్రులను అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

డాబాగార్డెన్స్ రహదారికి మరమ్మతులు


గోతులు పూడ్చిన మెయిన్ రోడ్డు

డాబాగార్డెన్స్, జనవరి 26: గ్రేటర్ 31వ వార్డుకు చెందిన డాబాగార్డెన్స్ మెయిన్‌రోడ్డులో గోతులను ఎట్టకేలకు పూడ్చారు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన కథనాలపై సంబంధిత అధికారులు స్పందించారు. ఆయా ప్రాంతాల్లోని రహదారికి మరమ్మతులు చేపట్టారు. ఎల్ఐసీ సర్కిల్ చుట్టూ నిత్యం వాహనదారులు, ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. అక్కడ ఉన్న గోతులలో పడి పలువురు ప్రమాదాలకు గురయ్యేవారు. దీంతో ఇప్పుడు మరమ్మతులు చేపట్టడంపై ప్రయాణికులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

ఫ్లోటింగ్ బ్రిడ్జికి ఒక్కరోజు వ్యాలిడిటీ

» ట్విట్టర్‌లో మాజీ మంత్రి గంటా ఎద్దేవా

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 26 : విశాఖ ఆర్కే బీచ్‌లో సముద్రంపై నిర్మించిన ఫ్లోటింగ్ బ్రిడ్జి ఒక్కరోజు వ్యవధిలోనే కూలిపోవడం దారుణమని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ట్విట్టర్‌లో విమర్శించారు. ఎంతో ఆర్భాటంగా 1.60 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ వంతెన ఒక్కరోజు వ్యాలిడిటీతో ఈ ప్రభుత్వ పనితనం ఏమిటో మరోసారి రుజువైందన్నారు. కొద్దిరోజుల కిందట విశాఖ నగరంలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన మోడల్ బస్ షెల్టర్ నాలుగు రోజులకే కుప్పకూలిందని గుర్తు చేశారు. ప్రతిదీ ఇలా నిర్మించడం.. ఆ వెనువెంటనే కూలిపోవడం ఆనవాయితీగా మారిందని ఎద్దేవా చేశారు. ప్రచారాలకు తప్ప అభివృద్ధికి, ఇతర నిర్మాణాలకు పనికిరాని ప్రభుత్వమని మరోసారి నిరూపితమైందని పేర్కొన్నారు. 'ఒక చిన్న బస్‌షెల్టర్, ఫ్లోటింగ్ బ్రిడ్జి సక్రమంగా నిర్మించలేని వాళ్లు రాజధాని, పోలవరం నిర్మిస్తారట.. జగనన్న' అని జనాలు నవ్వుకుంటున్నారన్నారు. ప్రజలంతా గమనిస్తూనే ఉన్నారు. ఈ ప్రచారాల ప్రభుత్వానికి ఇక సమయం 50 రోజులే ఉందని హెచ్చరించారు. ప్రజలు బై జగన్‌కు చెప్పాల్సిన సమయం వచ్చేసిందన్నారు.

యువగళం పథకంతో యువతకు భవిష్యత్తు

టీడీపీ ప్రవేశపట్టనున్న యువగళం పథకంతో యువత భవిష్యత్‌కు గ్యారెంటీ లభిస్తుందని మాజీమంత్రి గంటా శ్రీనివాస్ అన్నారు. యువగళం పాదయాత్రలో భాగంగా రాష్ట్రమంతా తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకున్న పార్టీ యువనేత నారా లోకేశ్ సూచనలతో పథకాన్ని అమలు చేయనున్నారన్నారు. యువతే దేశానికి బలమని, రాష్ట్రాభివృద్ధిలోనూ వారి పాత్ర ఎంతో కీలకమన్నారు. ప్రపంచంలోనే అత్యధిక శాతం మంది యువత ఉన్న దేశం భారత్ అని తెలిపారు. యువత తలుచుకుంటే ఏదైనా సాధ్యమేనని అన్నారు. అవినీతిని అంతం చేయాలన్నా, అభివృద్ధికి బాటలు వేయాలన్నా, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలన్నా యువతే కీలకమన్నారు.

'లక్ష ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వాలి'

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 26: ఎన్నికల కోడ్ వచ్చే లోగా లక్ష ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగున్నరేళ్లుగా అనేక పోస్టులను భర్తీ చేయకుండా నిర్లక్ష్యం వహించిందన్నారు. అలాగే, రెండు రోజుల కింద జరిగిన గ్రూప్-2 పరీక్షలో జాగ్రఫీ కొంత ఇబ్బంది పెట్టిందన్నారు. ఇండియన్ సొసైటీలో ఎక్కువగా సోషియాలజీకి సంబంధించిన లా, సెక్షన్స్ అడిగారని, ఇది గ్రూప్-2 అభ్యర్థుల స్థాయికి మించి ఉన్నట్టు ఆయన తెలిపారు. కరెంట్ అఫైర్స్‌లో ప్రస్తుత పరిస్థితులు అడగకుండా చరిత్రకి సంబంధించి ఇవ్వడం ఇదే మొదటిసారని పేర్కొన్నారు. సచివాలయం తరహాలో క్వాలిఫైయింగ్ మార్కులుంటే అభ్యర్థులు అర్హత సాధించలేకపోవడం వల్ల గ్రేస్ మార్కులు అడగడం ప్రారంభిస్తారని చెప్పారు. ఈ ప్రశ్నపత్రాన్ని బట్టి బీసీలకు 70 మార్కుల లోపు కట్‌ఆఫ్ ఉంటుందని, బీసీలకు 60, ఎస్సీ, ఎస్టీలకు 50 కట్‌ఆఫ్ ఉండవచ్చని అంచనా వేశారు.

ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు

మహారాణిపేట, ఫిబ్రవరి 26: జిల్లా వ్యాప్తంగా ఈనెల 26వ తేదీనుంచి మార్చి 1 వ తేదీ వరకు ఆర్థిక అక్షరాస్యతా వారోత్సవాలు జరగనున్నట్లు జాయింట్ కలెక్టర్ మయూరి అశోక్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎల్‌డీఎం ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు 2024 -25 సంవత్సరాలకు సంబంధించి భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఆదేశాల మేరకు ఎస్‌బీఐ ఆధ్వర్యంలో జిల్లాలో వారోత్సవాలు నిర్వహి స్తున్నట్లు చెప్పారు.

పోలీసు అదుపులో ఆరుగురు పేకాటరాయుళ్లు

మహారాణిపేట, ఫిబ్రవరి 26: మహారాణిపేట పోలీసు స్టేషన్ పరిధి రామజోగిపేట ప్రాంతంలో సోమవారం టాస్క్ ఫోర్సు పోలీసులు దాడులు జరిపి పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1.15 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. మహారాణిపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి: డీఈవో

మహారాణిపేట, ఫిబ్రవరి 26: మహారాణిపేట మండలంలోని ప్రత్యేక అవస రాలు గల పిల్లలను ఉద్దేశించి భవిత సెంటర్లను ఏర్పాటు చేసినట్టు డీఈవో చంద్రకళ పేర్కొన్నారు. సోమవారం ఆమె ఈ మేరకు నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు భవిత కేంద్రాల్లో వారంలో రెండు రెండు రోజుల పాటు ఫిజియోథెరపీతో పాటు బదిరులైన చిన్నారులకు స్పీచ్ థెరపీ నిర్వహించనున్నట్లు తెలిపారు. పిల్లలను తీసుకువచ్చి కేంద్రాల్లో అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీసీ శ్రీనివాస్ , గీతా తదితరులతో పాటు పలువురు పాల్గొన్నారు.

నిమ్మకాయల వ్యాపారులకు నష్టాలు


నరసింహనగర్ రైతుబజారులో విక్రయాలు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 26: వేసవిలో నిమ్మకాయలకు డిమాండ్ ఉంటుంది. ఎండల తాకిడినుంచి ఉపశమనం కోసం నిమ్మరసాన్ని తాగాలని వైద్యులు సూచిస్తుంటారు. దీంతో వీటికి డిమాండ్ పెరిగింది. పంట దిగుబడి తక్కువ ఉండడంతో గూడూరు నుంచి నిమ్మకాయలను దిగుమతి చేసుకుని రైతుబజారులో విక్రయిస్తున్నారు. 45 కిలోల బస్తా రూ.5వేలకు అక్కడి నుంచి తీసుకువచ్చి విక్రయించాలంటే చాలా కష్టంగా ఉందని వ్యాపారులు అంటున్నారు. రైతుబజారులో కిలో రూ.110లకు వి క్రయించాలని బోర్డు పెట్టారని, ఆ ధరకు విక్రయించాలంటే తమ కు నష్టం వస్తోందని వాపోతున్నారు. అయినా, దిగుమతి అవుతున్న నిమ్మకాయలు బాగోలేకపోవడంతో వినియోగదారులు తక్కువ ధరకు అడుగుతున్నట్టు చెబుతున్నారు. దీంతో విక్రయాలు లేక ఆ సరకు అంతా కుళ్లిపోయి మరింత నష్టం వాటిల్లుతుందని వాపోతున్నారు. ఇకనైనా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులు స్పందించి నిమ్మకాయలకు గిట్టుబాటు ధర కల్పించేలా బోర్డు పెట్టాలని కోరుతున్నారు.

స్పందనకు నాలుగు వినతులు

భీమునిపట్నం, ఫిబ్రవరి 26 : పట్టణంలోని జోనల్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి నాలుగు వినతులు అందాయి. జడ్సీ కనకమహాలక్ష్మి వినతులు స్వీకరించారు.నాలుగు అర్జీలు కూడా పట్టణ ప్రణాళికా విభాగానికి చెందినవి కావడంతో వాటిని ఆ శాఖాధికారులకు పంపించి వారం రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించినట్టు కార్యాలయం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తెలిపారు.

అనధికార బోర్డు తొలగింపు



కల్వర్టు వద్ద తొలగించిన బోర్డు

విశాఖపట్నం, ఫిబ్రవరి 26 : బీచ్ రోడ్డులోని పెద చాకిరేవు గెడ్డ వద్ద జరుగుతున్న ప్రైవేట్ పనుల్లో భాగంగా జీవీఎంసీ పేరుతో ఏర్పాటు చేసిన అనధికార బోర్డును అధికారులు సోమవారం తొలగించారు. ఆ ప్రదేశంలో జీవీఎంసీ పేరుతో బోర్డు పెట్టి వర్క్ ఇన్ ప్రోగ్రెస్ అని పేర్కొనడంపై విమర్శలు తలెత్తిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన అధికారులు ఆ బోర్డును తొలగించారు. ప్రైవేటు పనుల వద్ద జీవీఎంసీ పేరుతో బోర్డు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా అధికారులు హెచ్చరించారు.

సెంట్రల్ జైలు రోడ్డులో చెత్త తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆరిలోవ, ఫిబ్రవరి 25 : ముడసర్లోవ నుంచి కేంద్ర కారాగారానికి వెళ్లే సర్వీసు రోడ్డులో పేరుకుపోయిన చెత్తను జీవీఎంసీ అధికారులు ఎట్టకేలకు తొలగించారు. సర్వీసు రోడ్డులో ఇరువైపులా చెత్త పేరుకుపోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్న విషయమై 'ఆంధ్రజ్యోతి'లో ఇటీవల కథనం వచ్చింది. దీనిపై స్పందించి అధికారులు రోడ్డులో పేరుకుపోయిన చెత్తను తొలగించి, శుభ్రం చేశారు. దీంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కొండపేటలో ఆక్రమణలు తొలగించాలి

తగరపువలస, ఫిబ్రవరి 26 : జీవీఎంసీ 1 వార్డు కొండపేట అంబేడ్కర్ భవన్ వద్ద ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలంలోని ఆక్రమణలను తొలగించాలని టీడీపీ విశాఖ పార్లమెంటు కార్యదర్శి పిట్ట సురేష్ కోరారు. సోమవారం ఆయన సంబంధిత అధికారులకు వినతిపత్రం అందజేశారు. అంబేడ్కర్ భవన్ వద్ద ఖాళీగా ఉన్న ప్రదేశాన్ని గతంలో పిల్లల ఆట పాటల కోసం మినహాయించారని,ప్రస్తుతం ఆ స్థలాన్ని కొంతమంది ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. అలాగే శిథిలావస్థలో ఉన్న అంబేడ్కర్ భవనానికి మరమ్మతులు చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు ఎస్సీ సెల్ నాయకులు తాటిపూడి అప్పలరాజు, నరవ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం



విద్యార్థికి ఆర్థిక సాయం అందిస్తున్న దివీస్ ప్రతినిధులు

భీమునిపట్నం (రూరల్), ఫిబ్రవరి 26 : మండలంలోని అన్నవరం గ్రామానికి చెందిన మత్స్యకార యువకుడు మూగి శివ లండన్‌లోని నార్తు అంబ్రియా యూనివర్సిటీలో ఎంఎస్సీలో బిగ్ డేటా సైన్సు కోర్సు చేయడానికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని దివీస్ కంపెనీ అందజేసింది. ఈమేరకు కంపెనీ ప్రతినిధులు యువకుడి కుటుంబ సభ్యులకు సోమవారం రూ.10 లక్షల చెక్కు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దివీస్ జనరల్ మేనేజరు కోటేశ్వరరావు, ఎంఎస్ఎన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **భ్రమయుగం :** జగదాంబ, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **సుందరం మాస్టర్ :** శారద, శరత్, సౌజన్య (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), లక్ష్మి (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ముఖ్య గమనిక :** వెంకటేశ్వర
- **సిద్దార్థ్ రాయ్ :** శ్రీరామ, శ్రీకన్య, శ్రీలీలామహల్, మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **ఊరు పేరు భైరవకోన :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి, నరసింహ (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ఈగల్ :** రమాదేవి, మోహిని (గాజువాక)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 28,టమాటా 18, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (నలుపు) 24, బెండకాయలు 34, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 48, బీరకాయలు 40, ఆనపకాయలు 20, కాలీఫ్లవర్ 26, క్యాబేజ్ 24, క్యారెట్ 22, దొండకాయలు 32, బంగాళా దుంపలు 17, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 65, అల్లం (పాతది) 110, బరబటి 26, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 40, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 52, ఆగాకర 52, పొటల్స్ 62, కీరదోస 32, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 48, చిలగడదుంపలు 28, కంద 60, దేముడు చిక్కుడు 58, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 60, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు

బ్యాగ్		
రైతు ధర	--	125
ఫారం ధర	--	145
విత్ స్కిన్	--	260
స్కిన్‌లెస్	--	270

మరికొన్ని సిటీ వార్తలు పేజీ[లో..



పద్మనాభంలో ఏర్పాటు చేసిన చేయూత మహిళా మార్టు



సరకులు కొనుగోలు చేస్తున్న మహిళలు

ఎస్‌హెచ్‌జీ సభ్యులతో బలవంతపు కొనుగోళ్లు

- మహిళా మార్టులో ప్రతి నెలా రూ. 2 వేలు సరకులు కొనుగోలు చేయాలని అధికారుల ఆదేశం
- లేకపోతే పథకాలు రావని బెదిరింపు

పద్మనాభం, ఫిబ్రవరి 26 :పద్మనాభంలో స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యుల వాటా ధనంతో ఏర్పాటు చేసిన చేయూత మహిళా మార్టులో ఎస్‌హెచ్‌జీ సభ్యులతో నిత్యావసర సరకులను బలవంతంగా కొనుగోలు చేయిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మహిళా మార్టుకు కేవలం ప్రభుత్వం నుంచి స్థలం మాత్రమే కేటాయించగా ప్రతి సభ్యురాలి నుంచి రూ. 450 చొప్పున వాటాధనం చొప్పున రూ. 60 లక్షలు వసూలు చేసి మార్టును ఏర్పాటు చేశారు. మహిళల సొమ్ముతో ఏర్పాటు చేసిన ఈ మార్టులో ప్రతి స్వయం సహాయక సంఘంలోని మహిళ తప్పనిసరిగా రూ. 2 వేల విలువైన సరకులు కొనుగోలు చేయాలని బలవంతం చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈమేరకు గ్రామాల్లో పనిచేస్తున్న వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బంది (సీఏ) మహిళా సంఘాల సభ్యులతో సమావేశం ఏర్పాటు చేయించి ఒక్కొక్కరి నుంచి రూ. 2 వేలు విలువైన నిత్యవసర సరకులు కొనుగోలు చేయడానికి వారి పొదుపు ఖాతాల నుంచి నగదును నేరుగా మహిళా మార్టుకు చెల్లించే విధంగా తీర్మానం చేయిస్తున్నారు. ఆ విధంగా వారు మహిళా మార్టులోనే నిర్ధేశించిన మొత్తంలో సరకులు కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తున్నారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. సరకులు కొనుగోలు చేయకపోతే రుణాలు, రావాల్సిన పథకాలు ఆగిపోతాయని భయపెడుతుండడంతో వివిధ గ్రామాల నుంచి మహిళలు వచ్చి ఇక్కడ సరకులు కొనుగోలు చేస్తున్నారు. తమకు కావలసినవి కొనుగోలు చేసుకుంటామని, ఇంతమొత్తంలో ఇక్కడే కొనుగోలు చేయాలని నిబంధనలు విధిస్తే ఎలాగని పలువురు ప్రశ్నిస్తున్నారు. కొన్ని వస్తువుల ధరలు స్థానిక దుకాణాల కంటే ఎక్కువగా ఉన్నాయని పలువురు తెలియజేస్తున్నారు. మహిళా మార్టును ప్రోత్సహించడానికి సంబంధిత శాఖ అధికారులు ఈవిధమైన పద్ధతులతో సామాన్య మహిళలను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని వ్యాఖ్యానిస్తున్నారు. ప్రభుత్వ వసతి గృహాలు, కేజీబీవీ, గురుకుల పాఠశాలలు, భోజన పథకానికి ఈ మార్టు నుంచి నిత్యవసరాలు కొనుగోలు చేసే విధంగా ప్రోత్సహిస్తే మార్టు వృద్ధిలోకి వస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. దీనికి అనుబంధంగా నిత్యం రైతు బజారు తరహాలో స్థానిక రైతుల ద్వారా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు వంటివి కూడా అందుబాటులో ఉంచి అమ్మకాలు చేయిస్తే వినియోగదారుల తాకిడి పెరిగి మార్టులో కొనుగోలు సామర్థ్యం పెరిగే అవకాశముందని తెలియజేస్తున్నారు.

కాగా ఈ విషయమై వైకేపీ ఏపీఎం ప్రభాకర్‌ను వివరణ కోరగా మహిళా సంఘాల సభ్యులతో బలవంతపు కొనుగోలు చేయించడం లేదని, ప్రతీసభ్యురాలు తమకు అవసరమైన సరకులు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని చెప్పారు.

ఉన్నతమైన ఆలోచనలతో మంచి భవిష్యత్తు

'సోలార్ ఎనర్జీ అండ్ ఫోటోవోల్టిక్ పీవీ సిస్టమ్స్' సదస్సులో వక్తలు



సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 26 : యువత నూతన ఆవిష్కరణల దిశగా అడుగులు వేయాలని భారత ప్రభుత్వ ఎంఎస్ఎంఈ శాఖకు చెందిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మైక్రో స్మాల్, మీడియం ఎంటర్ ప్రైజెస్ (ఎన్ఐ-ఎం ఎస్ఎంఈ) డైరెక్టర్ జనరల్ డాక్టర్ గ్లోరియా స్వరూప అన్నారు. ఏయూ ఇంక్యుబేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సోలార్ ఎనర్జీ అండ్ ఫోటోవోల్టిక్ పీవీ సిస్టమ్స్' ఐదు రోజుల ఈఎస్‌డీఐ ప్రారంభోత్సవంలో సోమవారం ఆమె ప్రసంగించారు. దేశంలో 54 శాతం యువత ఉన్నప్పటికీ గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్‌లో భారత్ 43వ స్థానంలో నిలవడం దారుణమన్నారు. యువత సౌరశక్తిని ఉపయుక్తంగా నిలుపుకునే ఆవిష్కరణలు జరపాలని సూచించారు. సౌరశక్తి సామర్థ్యాన్ని యువత తెలుసుకోవాలన్నారు. స్టార్టప్‌లు దేశ వ్యాప్తంగా గణనీయంగా పెరుగుతున్నాయని, లదాక్ నుంచి లక్షద్వీప్ వరకు స్టార్టప్‌లు విస్తరణ జరుగుతోందన్నారు. ఏయూలో నెలకొల్పిన స్టార్టప్ ఎకో సిస్టం, ఇంక్యుబేషన్ కేంద్రాలు యువతకు అవసరమైన మార్గదర్శకాన్ని అందిస్తాయని చెప్పారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం. జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ పాశ్చాత్య దేశాలకు లేని సంపద, భారత్‌కు ఉందన్నారు. కార్యక్రమంలో ఏయూ ఐపీఆర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం, సీఈఓ రవి ఈశ్వరరావు, మేనేజర్ దివాకర్, తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 26 : దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకమని మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ అన్నారు. సోమవారం ఆయన ఏయూలోని టీఎల్ఎన్ సభా హాల్‌లో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'యువ సంవాద్' సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి యువకుడు దేశ భవిష్యత్తు కోసం కలలు కని, వాటి సాధనకు కృషి చేయాలన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర మోహన్ మాట్లాడుతూ మోదీ వివరించిన పంచ్ ప్రాణ్ సూత్రాలను అంతా పాటించి, వికసిత్ భారత్‌ను ఆవిష్కరించాలన్నారు. అనంతరం వర్సిటీ స్థాయిలో పంచ్ ప్రాణ్‌పై నిర్వహించిన వక్తృత్వ పోటీలో పాల్గొన్న 30 మంది యువతకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె. శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ



రమణ కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ఆనందపురం, ఫిబ్రవరి 26 : మండలంలోని శొంఠ్యాం పంచాయతీ మిందివానిపాలెం గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు పల్ల రమణ కుటుంబ సభ్యులకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కును ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సోమవారం తన క్యాంపు కార్యాలయంలో బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. రమణ (49) లివర్ సిర్రోసిస్ సమస్యతో బాధపడుతుండడంతో వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.10లక్షల మంజూరయ్యాయి. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు మజ్జి వెంకటరావు, పెదబాబు, పాండ్రంకి శ్రీను, బీఆర్‌టీ నాయుడు, కోరాడ ముసలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

గెడ్డ నిండా ప్లాస్టిక్ వ్యర్థాలు



చెత్తతో పేరుకుపోయిన తోటగరువు గెడ్డ

ఆరిలోవ, ఫిబ్రవరి 26 : పెదగదిలి నుంచి తోటగరువు వెళ్లే మార్గంలో ఉన్న గెడ్డలో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి. దీంతో అటువైపుగా రాకపోకలు సాగించే వారు దుర్వాసనకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో జీవీఎంసీ రూ. 3.50 కోట్లతో వంతెన నిర్మాణం చేపడుతోంది. ఈమేరకు నీరు ప్రవహించడానికి చిన్నపాటి తూములు ఏర్పాటు చేశారు. అయితే వాటి ద్వారా నీరు సాఫీగా ప్రవహించకపోవడంతో గెడ్డలో ఎక్కడి చెత్త అక్కడే నిలిచిపోతోంది. దీంతో అటువైపుగా రాకపోకలు సాగిస్తున్న స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.

3న పల్స్ పోలియో : కమిషనర్

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 26 : నగరంలో వచ్చే నెల 3న ఐదేళ్లలోపు చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేయనున్నట్టు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో డీఎంఓహెచ్ జగదీశ్వరరావు, జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, జోనల్ కమిషనర్లు, యూపీహెచ్‌సీ అధికారులతో పోలియో కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగర పరిధిలోని 8 జోన్‌లలో ఉన్న 72 యూపీహెచ్‌సీల్లోని 813 బూతుల్లో 36 ట్రాన్సిట్స్‌లను ఉపయోగించి, 1,17,687 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్టు చెప్పారు. ఈకార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా బస్ స్టేషన్‌లోనూ, రైల్వే స్టేషన్‌లోనూ, పబ్లిక్ ఉన్న ప్రాంతాల్లోనూ, రైతు బజార్‌లలో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి, పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జీవీఎంసీకి 104 వినతులు



వినతులు స్వీకరిస్తున్న మేయర్, కమిషనర్

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 26 : ప్రజలు పెట్టుకున్న అర్జీలను నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని మేయర్ గొలగాని హరివెంకటకుమారి, కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం వారు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో డయల్ యువర్ మేయర్, జగనన్నకు చెబుదాం కార్యక్రమాలు నిర్వహించారు. డయల్ యువర్ మేయర్‌కు 13 కాల్స్ రాగా, స్పందనకు 104 వినతులు వచ్చాయి.

'తూర్పు టికెట్ యాదవులకు కేటాయించాలి'



సమావేశంలో పాల్గొన్న యాదవ సంఘం నాయకులు

ఆరిలోవ, ఫిబ్రవరి 26 : తూర్పు నియోజకవర్గం టికెట్‌ను అన్ని రాజకీయ పార్టీలు యాదవులకు కేటాయించాలని తోటగరువు యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఒమ్మి చిన్నారావు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన తోటగరువులోని రాధాకృష్ణ కల్యాణ మండపంలో యాదవ సంఘం ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తూర్పు టికెట్‌ను అన్ని రాజకీయ పార్టీలు ఇతర కులాలకు కేటాయించడం సరికాదన్నారు. విశాఖ ఐక్యవేదిక కన్వీనర్ ప్రసాదుల భాగ్యానంద్ మాట్లాడుతూ నగరంలో యాదవుల ఓటర్లను ఆకర్షించడానికి హడావిడిగా యాదవ సంఘం భవనానికి శంకుస్థాపన చేశారని విమర్శించారు. రాష్ట్ర యాదవ హక్కుల పోరాట సమితి ఉపాధ్యక్షుడు కోడిబోయిన బాబ్జీ మాట్లాడుతూ యాదవులను అందరూ చిన్నచూపు చూస్తున్నారని, వైసీపీ తూర్పు సీటును అక్కరమాని విజయనిర్మలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. యాదవ సంక్షేమ సంఘం సభ్యుడు బమ్మిడి ఎల్లాజీ మాట్లాడుతూ మంత్రి కారుమూరు నాగేశ్వరరావు ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్‌పై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు.

అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం : ఎంపీ ఎంవీవీ



స్థానికులతో మాట్లాడుతున్న ఎంపీ సత్యనారాయణ, బొత్స ఝాన్సీ

ఆరిలోవ, ఫిబ్రవరి 26 : వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి కట్టుబడి ఉందని ఆ పార్టీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త, ఎంపీ సత్యనారాయణ అన్నారు. సోమవారం ఆయన 9 వార్డులోని సంజయ్‌గాంధీ కాలనీ, హనుమంతవాక జంక్షన్‌లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 49 రోజుల నుంచి నియోజకవర్గంలో పాదయాత్ర ద్వారా ప్రజా సమస్యలు తెలుసుకుంటున్నామని చెప్పారు. కానీ ప్రస్తుత ఎమ్మెల్యే వెలగపూడి మాత్రం ప్రజల ఇబ్బందులను పట్టించుకోవడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు అభివృద్ధిని చూసి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ, కార్పొరేటర్ స్వాతిదాస్, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యలపై నాయకులు పోరాడాలి

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 26: సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల సమస్యలపై సకాలంలో స్పందించడంతో పాటు వాటి పరిష్కారానికి బీఎంఎస్ నాయకులు ముందుండాలని భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) జాతీయ అధ్యక్షుడు హిరణ్మయి పాండే పేర్కొన్నారు. షీలానగర్‌లోని బీవీకే స్కూల్ ప్రాంగణంలో రెండు రోజుల పాటు జరిగిన బీఎంఎస్ నాలుగో రాష్ట్ర మహాసభలు ఆదివారం రాత్రితో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రంగాలలోను ముందుంటున్న మహిళలకు కార్మిక సంఘాలలోనూ తగిన ప్రాధాన్యాన్ని ఇవ్వాలని కోరారు. సభలో ఆశా మోలే, జగదీశ్వరరావు, రఘురామ్, చంద్రశేఖరరావు, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు ఆర్జిత సేవలు



సింహాచలం, ఫిబ్రవరి 26 : వరాహలక్ష్మీనృసింహస్వామికి సోమవారం పలు ఆర్జిత సేవలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో పరిమళభరిత పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించి, ప్రత్యేక వేదికపై ఉంచారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం శాస్త్ర విధానంలో కంకణధారణ, నూతనయజ్ఞోపవీత సమర్పణ చేసి కల్యాణ క్రతువు జరిపారు. అంతకముందు ప్రభాతారాధనల తరువాత సహస్రనామావళితో పవిత్ర తులసీ దళార్చన చేశారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనార్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

వరాహలక్ష్మీనృసింహస్వామిని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దర్శించుకున్నారు. ఈఓ శ్రీనివాసమూర్తి ఆయనకు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. కప్పస్తంభం ఆలింగనం తరువాత అర్చకులు అంతరాలయంలో ఎమ్మెల్యే గోత్రనామాలతో పూజలు చేసి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి దర్శనం అనంతరం పండితులు వేదాశీర్వచనాలీయగా, ఈఓ శాలువతో సత్కరించి స్వామివారి ప్రసాదాలు అందజేశారు.

విజినిగిరిపాలెంలో ఆలయ వార్షికోత్సవం



ఆలయంలో స్వామివారికి పూజలు చేస్తున్న నాయకులు

సింహాచలం, ఫిబ్రవరి 26 : జీవీఎంసీ 98వ వార్డు విజినిగిరిపాలెంలో కొలువుదీరిన అభయ ఆంజనేయస్వామి ఆలయ ఐదో వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. గ్రామ కమిటీ సారథ్యంలో ఉదయం 5 గంటలకు ప్రభాతారాధనలు చేశారు. అనంతరం గణపతి పూజ, పుణ్యాహవాచనములు, పంచామృతాభిషేకాలు, లక్ష తమల పత్రపూజ, సింధూరార్చన చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. సాయంత్రం ఆలయం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసి పరస నిర్వహించారు. విజినిగిరిపాలెం, సింహాచలం, అడివివరం ప్రాంతాల నుంచి అనేక మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ పివి నరసింహం, టీడీపీ నాయకులు గుసిడి అవినాష్‌బాబు, రౌతు రాంబాబు, గండ్రెడ్డి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి'

పద్మనాభం (రూరల్), ఫిబ్రవరి 26 :రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ జిల్లా కార్యదర్శి ఉప్పాడ రాము డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలను తక్షణమే చెల్లించాలన్నారు. అలాగే సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయులపై కక్ష సాధింపు ధోరణి విడనాడాలని, ప్రతి నెల 1న జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

అధ్వానంగా మరుగుదొడ్ల నిర్వహణ



మరుగుదొడ్ల వద్ద దుస్థితి

సింహాచలం, ఫిబ్రవరి 26 : సింహగిరిపై పలు ప్రాంతాల్లో భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మరుగుదొడ్ల నిర్వహణ లోపం వల్ల అధ్వానంగా ఉన్నాయి. ముఖ్యంగా నిత్యం ఎందరో ప్రముఖులు, దేవస్థానం ఉన్నతాధికారులు తిరుగాడే పీఆర్ఓ ఆఫీసుకు ఇరువైపులా ఉన్న మరుగుదొడ్ల పరిస్థితి చాలా దారుణంగా ఉంది. తలుపులు చాలా వరకు మరమ్మతుకు గురికాగా లోపలి భాగంలో ఫ్లెష్ ట్యాంక్ ఒక దానిలో లేకపోగా, మరొక దానిలో ట్యాంక్ పైకప్పు విరిగిపోయింది. తలుపులకు లోపల గడియలు పాడయ్యాయి. వాటిని తాత్కాలికంగా తాళ్లతో కట్టారు. అలాగే తలుపుల రేకులు గీసుకుని కొందరు భక్తులు గాయాల పాలవుతున్నారు. దేవస్థానం అధికారులు తక్షణమే స్పందించి మరుగుదొడ్ల నిర్వహణపై దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు.

రోడ్డు మూసివేతకు యత్నం



రోడ్డుపై వేసిన కర్రలు, ఏర్పాటు చేసిన తడక

ఆరిలోవ, ఫిబ్రవరి 26 : తోటగరువులోని రాధాకృష్ణ కల్యాణ మండపానికి సమీపంలో ఉన్న తూర్పు పక్కన గల వీధి రోడ్డును కొంతమంది స్థానికులు మూసి వేయడానికి ప్రయత్నిస్తున్నారు. రోడ్డుకు ఆవతల ఉన్న ఖాళీ స్థలాన్ని ఆక్రమించాలన్న ఉద్దేశంతో వారు ఈ పనికి ఒడుగట్టినట్టు తెలుస్తోంది. రోడ్డుకి అడ్డంగా చెక్ పోస్టు మాదిరి కర్రలు కట్టి, దానికి తాటి కమ్మలతో తడకలా ఏర్పాటు చేసి రోడ్డుకి అడ్డంగా వేశారు.ఎవరూ ఈమార్గంలో నడవకుండా ఈ పనిచేశారు. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదులు వెళ్లినా.. పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆరిలోవ, ఫిబ్రవరి 26 : విమ్స్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఇందిరానగర్ ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని జోన్ త్రీ ఆపరేషన్స్ విభాగం ఈఈ పోలాకి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందిరానగర్, రాజీవ్‌నగర్, ఆదర్శనగర్, సుందరనగర్, రవీంద్రనగర్ ప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు.

స్టీల్‌ప్లాంట్‌పై రాష్ట్ర మంత్రులు స్పందించకపోవడం దారుణం

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 26 : విశాఖ స్టీల్‌ప్లాంట్ స్థితిగతుల గురించి ఇతర రాష్ట్రాల మంత్రులు స్పందిస్తున్నా మన రాష్ట్రానికి చెందిన వారు చోద్యం చూస్తుండడం దారుణంగా ఉందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 1,110వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుతెన్నులు చూస్తుంటే ప్రజాస్వామ్యంలో వింత పోకడల్లా కనిపిస్తుందన్నారు. ప్రజా ఉద్యమాలకు విలువ ఇవ్వకపోతే పాలకులు ప్రజా సంక్షేమాన్ని ఏమి పట్టించుకుంటారని ప్రశ్నించారు. ప్రజల ఓట్లతో గెలిచిన పీఎం మోదీ అదానీ, అంబానీలకు కొమ్ము కాస్తూ పాలన సాగిస్తుండడం సమంజసం కాదన్నారు. నాయకుడు తాండ్ర కనకరాజు మాట్లాడుతూ ఉక్కు కర్మాగారం కోసం ఇళ్లు, భూములను కోల్పోయి ఇప్పటికీ వందలాది మంది నిర్వాసితులుగా ఉన్నారని, వారికి ఇప్పటికీ న్యాయం చేయకపోవడం విచారకర మన్నారు. ఎందరో ప్రాణత్యాగాలతో ఏర్పడిన స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తే తీవ్ర పరిణామాలను ఎదుర్కొనవలసి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కె.ప్రసాద్, కె.ఆనంద్, జి.గోపి, వి.ప్రసాద్, పి.సోమునాయుడు, ఎస్.సింహాద్రి పాల్గొన్నారు.